ఆదివారం

ప్రజాశక్తి

అక్టోబరు 12, 2003





విధ్వంసం సృష్టిస్తున్న

మందుపాత్రలు

హ్యాపీ బర్త్‌డే

(12-10-2003 నుండి 18-10-2003 వరకు)

రిష్మా
4॥సం, అక్టోబర్- 1999
అరుణ- చంద్రశేఖరరెడ్డి
సూర్యాపేట- నల్లగొండ

సాయిస్నేహిత
3॥సం,13. 10. 2000
సుజాత- గోవిందరాజు
మంచిర్యాల- ఆదిలాబాద్

కె. కీర్తి
1॥సం, అక్టోబర్- 2002
చంద్రకళ- రాంరెడ్డి
ధారూర్- రంగారెడ్డి

టి. సాయి సతీష్‌కుమార్
1॥సం,14. 10. 2002
రాజేశ్వరి- వెంకటరావు
గరివిడి- విజయనగరం

కె. రమ్యశ్రీ
7॥సం,14. 10. 1996
పద్మావతి- అంజయ్య
బోయిగూడ- హైదరాబాద్

కె. భాగ్యలక్ష్మి
4॥సం,16. 10. 1999
ఈశ్వరీభాయి- అప్పారావు
హుకుంపేట- శ్రీకాకుళం

హర్ష
అక్టోబర్- 17
రమా- గణేష్
వనస్థలిపురం- హైదరాబాద్

హరిణి
అక్టోబర్- 17
రమా- గణేష్
వనస్థలిపురం- హైదరాబాద్

బి. దీక్షిత
1॥సం,18. 10. 2002
పారిజాత-రాములు
రాంరెడ్డిపల్లి- నల్లగొండ

రక్త దర్శనం

రక్తం.. నెత్తురు.... ఉద్వేగ భరిత పదబంధాల్లో వీటికి సాటిలేదు. రక్త తర్పణం, రక్తదానం, రక్తతిలకం, రక్తాక్షరాలు వంటి పదాలు ఉత్తేజ ప్రదాతలు. రక్తపుటేరులు, రక్తపుమడుగు, రక్తస్రావం, రక్తదర్శనం వంటివి భీతిదాయకాలు. 'రక్తసంబంధం'... అనిర్వచనీయ అనుబంధాన్ని ఆవిష్కరిస్తుంది. రక్తకన్నీరు, నెత్తుటిముద్ద... గుండెలు పిండేస్తాయి. నెత్తురుకూడు జుగుప్స కల్గిస్తుంది. ఇలా నవరసాలు 'రక్తం'తో పండుతాయి.

కవిత్వానికే కాదు వ్యాపారానికీ రక్తం పనికొస్తుంది. రక్తం కొనుగోళ్లు, అమ్మకాలు పెద్ద లాభసాటి బిజినెస్. ఆపన్నుల నుండి తక్కువ ధరకు రక్తం కొనొచ్చు. ఆపదలో వచ్చిన వారికి ఎక్కువ ధరకు అమ్ముకోవచ్చు. పైగా ఆపద్బంధువు వంటి బిరుదులు కొట్టేయచ్చు. నిజానికి నియమిత కాలం దాటిన తర్వాత రక్తదానం చేసే వారికి పెద్ద నష్టం లేదు. పోయిన నెత్తురును శరీరం త్వరలోనే తయారు చేసుకొంటుంది. అత్యవసరమయితే ఆపరేషన్ టేబిల్ దగ్గర నుండి వెళ్లి రక్తం ఇచ్చేసి మరీ ఆపరేషన్లు పూర్తి చేసే డాక్టర్లున్నారు. వారు మహానుభావుల కోవలోకి వస్తారు. వారికి రెండు చేతులు జోడించి దండం పెట్టాలి. మరి కొందరుంటారు. ఎలక్ట్రానిక్ కెమెరాల ముందు మాత్రమే చొక్కా చేయి మడుస్తారు. సీసాడు రక్తం ఇచ్చి 'సీ' అంతటి ప్రచారం కొట్టేయాలని వారి తాపత్రయం. మరో కేటగిరి కూడా ఉంది. రక్తదానం అంటేనే వారి కాళ్లు వణుకుతాయి. ఆమడదూరం పరుగెడతారు. 'రక్తబంధం' కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతుంటే రక్తం అమ్మేవాడి కోసం అన్వేషణ మొదలెడతారు. మూర్ఖులు, అర్భకులు... అంతకంటే ఈ బాపతును ఏమనగలం.

రక్తంతో పిడచగట్టిన మూఢనమ్మకాలకూ మన దగ్గర కొదవలేదు. గ్రహశాంతి పేరిట మనదేశంలో రక్తం ఏరులై పారుతుంది. కోళ్లు, మేకలు, దున్నలేకాదు, మనుషుల తలలూ తెగిపడ్తుంటాయి. కూలీకి రమ్మని ఆ మాట ఈ మాటతో కన్నుగప్పి నరబలులు ఇచ్చిన ఉదంతాలు అప్పుడప్పుడయినా ముందుకొస్తుంటాయి. గుప్త నిధులకోసం స్వంత సంతానాన్నే బలిచ్చే కర్మభూమి మనది. డబ్బులు తీసుకొని పిల్లల్ని బలికోసం అప్పగించిన దౌర్భాగ్యులనూ చూశాం.

ఇదంతా ఒక ఎత్తు. పుణ్యం పేరుతో రక్తదర్శనం చేయించుకునే వారు మరో ఎత్తు. కొన్నేళ్ల క్రితం తమిళనాడులో ఒక క్రూర ఆచారం గురించి తెలుసుకొని విస్తుపోయాం. ఏదో ఒక ఉత్సవం సందర్భంగా పిల్లలకు గుండ్లు గీయించి నున్నటి గుండు మీద నిర్దయగా కత్తితో గాటు పెడ్తారు. రక్తదర్శనం కాగానే భక్తితో పరవశించి పోతారు. కత్తిగాటుకు పిల్లలు విలవిల్లాడుతుంటే గాయానికి పసుపు పూస్తారు. అలాంటిదే.. పిల్లలకు మత్తు మందు ఇచ్చి కొంతసేపు గుంటలో పూడ్చి బయటకు తీసే దురాచారం. ఇదీ తమిళనాడులోనే జరుగుతుంది. నిరుడు ఒక మంత్రి స్వయంగా ఈ భయానక తంతుకు హాజరయ్యారు. తమిళ తంబీలకు మనం ఏమాత్రం తీసిపోం. కర్నూల్ జిల్లా వాసులు నిరూపించి మరీ చూపారు. దేవరగట్టులో దసరా ఉత్సవాల సందర్భంగా తలలు పగులగొట్టుకొనే దురాచారం అక్కడ ఏళ్లుగా సాగుతోందట. ఈసారి పత్రికలు మూడు రోజులు ముందుగానే బయటపెట్టాయి. అయినా జిల్లా యంత్రాంగం స్పందించలేదు. ఫలితంగా దసరా రోజున 150 మంది తలలు పగిలాయి. స్మార్ట్ ప్రభుత్వం గదా.. దానికి ఇదో సదాచారంగా కన్పించి ఉంటుంది. లేదా ప్రపంచబ్యాంకు ఉపదేశాల్లో ఇది లేదు కాబోలు. ఉంటే స్పందించి ఉండేదే...ఏమంటారు. ●

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం . . . 2
కవర్ స్టోరీ . . . 5
జీవనశైలి . . . 8
గేయలహరి . . . 9
బాలల కథ . . . 11
బాలనేస్తాలు . . . 12
కచేరి . . . 14
ఇంతిసంగతులు . . . 15
క్రీడారంగం . . . 17
పుస్తక పరిచయం . . . 20
కళాసాహితి . . . 21
ఆరోగ్యం . . . 22
పలుకుబడి . . . 24

ఇంకా...

చింత చింత
కథ . . . 4



పిల్లల సందేహాలు తీర్చాలి
బాలవికాసం . . . 10

కేసరిగిరి క్షేత్రమే కీసరగుట్ట
టూరిస్ట్‌గైడ్ . . . 16

దర్జా ఎల్లయ్య
రియల్ స్టోరీ . . . 18, 19

కార్టూన్ కదంబం


మా సిద్ధాంతమెప్పుడూ
క్లియర్‌గానే..
ఉంటుంది!!
ఎన్నికల అజెండా
అయిదు రాష్ట్రాల ఎన్నికలు
Dhar..


సి.ఎం
కోత(టి)వరలు
నాకెందుకో..
ఇలా.. రాస్తేనే..
న్యాయమనిపిస్తుంది సార్!

1
పోలీసుశాఖను ప్రక్షాళన చెయ్యాల్సిందే!
ప్రభుత్వం
2
యస్ ప్రక్షాళన చెయ్యాల్సిందే సార్
హోమ్
3
ప్రక్షాళన చెయ్యాల్సిందే సార్
4
ప్రక్షాళన చెయ్యాల్సిందే సార్
Dhar..

ఇక అంతా మంచినీళ్ళప్రాయమే!

ఇంటర్వ్యూకు వెళ్ళాలంటే ఇంగ్లీష్!
ఇ-మెయిల్ పంపాలంటే ఇంగ్లీష్!
కంప్యూటర్ నేర్చుకోవాలంటే ఇంగ్లీష్!
కాంపిటేటివ్ ఎగ్జామ్స్ వ్రాయాలంటే ఇంగ్లీష్!
విదేశాలకు వెళ్ళాలంటే ఇంగ్లీష్!
ఎక్కడ చూసినా ఇంగ్లీష్.. ఇంగ్లీష్.. ఇంగ్లీష్..

"నేనూ ఎన్నో విధాల ప్రయత్నించి చూసాను. కాని నేను మాత్రం ఇంగ్లీషులో సరిగ్గా మాట్లాడలేకపోతున్నాను. ఏదైనా తప్పుగా మాట్లాడేస్తానేమో అని భయంగా వున్నది".

ఇదేనా మీ ప్రాబ్లమ్...? NO PROBLEM !

మిచేత సరళంగా ఇంగ్లీషులో మాట్లాడించటానికి సులభమైన ఫార్ములా కనిపెట్టాం. అవును, **'స్పీచ్ జనరేటింగు ఫార్ములా' SGF™** పద్ధతిలో మేము తయారుచేసిన **స్పోకన్ ఇంగ్లీష్ ట్రైనింగ్ కోర్స్** పాఠాలను రోజూ అరగంట చదివి ప్రాక్టీసు చేస్తే చాలు.

వ్యాకరణ దోషం లేకుండా వాక్యాలను రూపొందించి వ్రాయటం నేర్చుకొని ఇంగ్లీషులో తడబడకుండా సరళంగా మాట్లాడటానికి మీవల్ల అవుతుంది. ఇప్పటికే **5** లక్షల మంది ఈ శిక్షణ ద్వారా ఫలితం పొందారు.

ఇంకా ఏంటి ఆలోచిస్తున్నారు?

వెంటనే క్రింద వున్న కూపను పూర్తిచేసి పంపండి. కోర్సు పాఠాలు **V.P.P.** ద్వారా మీ ఇంటిని వెతుక్కుంటూ వస్తాయి. పోస్ట్‌మేన్ వద్ద **రూ.395/-** చెల్లించి పాఠాలను తీసుకోండి.

ప్రతిరోజూ అరగంట పాఠాలు చదివి ప్రాక్టీసు చెయ్యండి, ఇంగ్లీషులో గడగడమని మాట్లాడండి.

ఇదిగో కూపన్

Yes, నేను అరగంట సమయం కేటాయించి ఇంగ్లీషు నేర్చుకోవాలని ఆశిస్తున్నాను. నాకు కోర్సు పాఠాలను V.P.P. ద్వారా వెంటనే పంపండి. పోస్టుమేన్ వద్ద **రూ.395/-** చెల్లించి తీసుకుంటాను.

పేరు: ....

చిరునామా: ....

....

.... PIN..............

వివేకానంద ఇన్‌స్టిట్యూట్
స్పోకన్ ఇంగ్లీష్ ట్రైనింగ్ కోర్స్
ఇక ఇంగ్లీష్ మంచినీళ్ళప్రాయమే!

కోర్సుతో పాటు 416 పేజీల ఇంగ్లీష్-తెలుగు డిక్షనరీ ఉచితంగా పొందండి.

VIVEKANANDA INSTITUTE

9 (T), Madley Road, T.Nagar, Chennai - 600 017.

PSKT

10/TEL/03/NAGA

వివేకానంద ఇన్‌స్టిట్యూట్‌యొక్క ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: HYDERABAD: (•S.R.NAGAR ☎ 23714330. •MEHDIPATNAM ☎ 55755888. •DILSUKH NAGAR ☎ 24044352. •KUKATPALLY ☎ 55341431. •RAMACHANDRA PURAM. •VANASTHALI PURAM ☎ 24122464. • A.S.RAO NAGAR). •NELLORE ☎ 2327702. •THIRUPATI ☎ 2252878. •ANANTAPUR ☎ 241029. •KAKINADA ☎ 2386638. •VIJAYAWADA ☎ 5530053. •GUNTUR ☎ 2238541. •VISAKHAPATNAM ☎ 2738892. •KURNOOL. •RAJAHMUNDRY ☎ 2422003. •NIZAMABAD ☎ 235767. •CUDDAPAH ☎ 224445. •KARIMNAGAR ☎ 2234883. •WARANGAL ☎ 2578946. •MIRYALGUDA ☎ 230130.

❋ రాణి పులోమజాదేవి

చింత చింత



"అమ్మబాబోయ్! వచ్చేస్తున్నారు. గొడ్డళ్ళు, రంపాలు, మొద్దుకత్తులు పట్టుకొని యమదూతల్లా వచ్చేస్తున్నారు. ఈ రోజు ఎవరి వంతో పాపం! తన కళ్ళ ముందు పుట్టి పెరిగిన పిల్లలంతా... తను రాలిపోతే చూడవలసిన వాళ్ళు. అలాంటిది తన కళ్ళ ముందే వాళ్ళంతా ఒక్కొరొక్కరుగా లేకుండా పోతుంటే తను ఇంత వయస్సు పెట్టుకొని కూడా నిస్సహాయంగా చూస్తుండి పోవలసి వచ్చింది.

అన్నం పెట్టే చేతిని నరకడమంటే ఇదే! మానవుడు ఎంత స్వార్థపరుడు, కృతఘ్నుడు, అవకాశమున్నంత కాలం పాలిచ్చి పోషించిన ఆవు వట్టిదైతే దానిని పోషించడం దండగని కసాయివాడికి అమ్మి సొమ్ము చేసుకొని సంతోషించేవాడు, వాడి నుండి కృతజ్ఞత నాశించడం ఎండమావి నుండి నీటిని ఆశించడం లాంటిదే!

అయినా మానవుడు ఈ మధ్య కాలంలోనే మరీ ఇంత నైచ్యానికి దిగజారాడు. తను వందేండ్లుగా ఈ మనుష్యుల మనస్తత్వాలను గమనిస్తోంది. ఆనాడు కాకులు దూరని కారడవిగా ఈ ప్రాంతం ఉన్న రోజుల్లో తానిక్కడ మొక్కగా మొలిచింది. తను పెద్దై చిగురు దొడిగి, పూతపూసి, పిందె వేసేసరికి వచ్చారు మనుషులు ఈ అడవిలో దారి చేసుకొని. దోరకాయలను, మంచి పండును చూసుకొని ఆనందంగా, తీవిగా గాలికి తలలూపుతున్న తననెక్కి కాయలు, పండ్లు కోసుకోసాగారు. "అయ్యయ్యో! నా కాయలు -నా పండ్లు" అని కోపంతో వాళ్ళను జార్చి కింద పడెయ్యాలని ప్రయత్నించిన తనను చుట్టుపక్కల ఉన్న పెద్దలు వారించారు. "చూడు నాయనా! పరోపకారార్థం ఇదం శరీరం అన్నది ఆర్యోక్తి. అందుకు చక్కని సాక్ష్యమే మనం. మొక్కగా మొలిచిన నాటి నుండి పర్యావరణాన్ని రక్షిస్తూ, భూమిలో నీటి నిలువను పెంచుతూ, వర్షం సకాలంలో పడేలా చూస్తూ, ఎండలో నీడను కల్పిస్తూ, పోతూ కూడా కొయ్యను అందిస్తూ మన జీవనంలోని అనుక్షణాన్ని ఇతరుల కోసమే గడిపేయాలి మనం. ఈ కాయలను, పండ్లను ఎవరూ కోసుకోలేదనుకో – వాటికి వినియోగం ఏముంటుంది? రాలిపడిపోవడమేగా! అంతకన్నా వీళ్ళు కోసుకొని సంతృప్తిగా తినడమే మంచిది. ఏమంటావ్! ఏ వస్తువుకైనా వాడకాన్ని మించిన ఉపయోగం ఏముంటుంది చెప్పు? స్వార్థాన్ని ఎప్పుడూ నీ దరి చేర్చకు". ఇంకెప్పుడూ స్వార్థంగా ఆలోచించాలనే ఆలోచన కూడా రాలేదు తనకు. ఆ రోజు నుండి ఆనందంగా తన ఫలాలను మానవునికి అందించింది.

తన చుట్టూ ఉన్న పెద్దలంతా క్రమంగా వయస్సు వాలిపోవడంతో వాలిపోయారు. క్రమంగా ఈ అడవి ప్రాంతంలో కొంత రహదారిగా మారింది. దారిలో నడిచివెళ్ళే వాళ్ళ కోసం దారి వెంట నాటారు మొక్కలను. ఆ మొక్కలే ఈనాడు ఇంతై వటుడింతై అన్నట్టుగా కన్నుల పండువగా తయారై నీడనిస్తూ, ఆకలి తీరుస్తూ ఉన్నాయి. సప్త సంతానాల్లో ఒకటైన చెట్లు నాటడం అంటే ఓ భక్తి ఆనాడు. రాజులు చేసిన సత్కార్యాలలో ఒకటిగా చరిత్రలో చెప్పబడింది ఈ చెట్లు నాటడం.

అలాంటిది ఇన్ని ఏళ్ళకు ఇప్పుడు వచ్చారీ వృక్షనాశకులు. ఓ వైపు వన సంపదే మన సంపద అని అరుస్తూ, అడవులు వానలకు పిలుపులు అని ఓ వైపు నినాదాలిస్తూ మరోవైపు జీవనాధారాలైన చెట్లను కొట్టి మొక్కలను నాటుకుంటూ, మబ్బుల్లో నీళ్ళు వస్తాయని ముంత పగలగొట్టుకొనే మనస్తత్వంతో ఈనాటి మనిషి మాటలకు, చేతలకు పొంతన లేకుండా ఆత్మవంచన చేసుకుంటున్నాడు.

మన దేశంలో లభించే వనరులను వాడుకొని స్వయం సమృద్ధిగా ఎదగకుండా అదేదో ప్రపంచ బ్యాంకు ఇచ్చిన ఋణాలను తెచ్చుకొని వడ్డీ కట్టుకుంటూ, పోనీ ఆ డబ్బయినా ఏవైనా అభివృద్ధి పథకాలకు వినియోగించక తిరిగి ఏ విధమైన లాభాలను ఇవ్వని ఈ అనవసర రోడ్ల పెంపు కార్యక్రమం కేవలం చెట్ల నాశనానికే వచ్చినట్లుంది. ఎవరో చెప్పినట్లు రంగి పెళ్ళి మంగి చావుకొచ్చిందిట.

ప్రపంచంలో అత్యధిక నీటి వనరులను కలిగి, దట్టమైన, విలువైన వనసంపద ఉండి, సమశీతోష్ణస్థితి కలిగిన మన దేశమే ఇలా యాచక వృత్తినవలంబిస్తే – ఇక ఈ మాత్రపు వనరులు కూడా లేని బీదదేశాల పరిస్థితి ఏంటి?

చెట్లు కొట్టివేయబడి, అడవులు నాశనం చేయబడి, పర్యావరణ సమతౌల్యం దెబ్బతిని జీవులంతా నిర్వీర్యులుగా తిరుగుతుంటే అప్పుడీ రోడ్ల మీద శవయాత్రలు జరగాల్సిందే!

ఏసీ రూముల్లో కూర్చుని, గుడ్డి విద్యుద్దీపాల క్రింద ఉండి ఉండి అలవాటు పడిన ఈ రాజకీయ నాయకులను, కుహనా వనాల్లో ఫొటోలకు ఫోజులిచ్చే వీళ్ళను నిజమైన అరణ్యాలలో ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా ఓ నెల రోజుల పాటు వదిలేస్తే అప్పుడే స్వార్థంతో పుచ్చిపోయిన వాళ్ళ మెదళ్ళు చక్కబడి ఆరోగ్యవంతంగా ఆలోచించడం మొదలు పెడతాయి. ఈ స్వచ్ఛమైన గాలి పీలిస్తేనే వాళ్ళ విషపూరిత మనస్సులు పాలనురగలా తయారై దేశం కోసం సరైన ప్రణాళికలు వేస్తాయి.

"అయ్యో! యంత్రాల్లాంటి ఈ కూలీ మనుష్యులు బానిసల్లా రంపాలతో, గొడ్డళ్ళతో నా చిన్నారి స్నేహితులను నరుకుతున్నారే!

అరే! పిచ్చివాళ్ళల్లారా! మీ భవిష్యత్తుపై మీరే బూడిద చల్లుకుంటున్నారా! నివురు కప్పిన మీ చిన్నమెదడులను వివేకపు కొలిమిలో పెట్టి ఆలోచనల తిత్తితో ఊదండి. మీకు స్నేహితులెవరో శత్రువులెవరో తెలుసుకోండి.

అప్పుడు మీ చేతిలోని గొడ్డళ్ళు, రంపాలు ఎవరివైపు గురి చూడాలో తెలుస్తుంది".

వయోభారం కన్నా దుఃఖ భారం ఎక్కువై ఫెళ్ళుమని విరిగిపడిపోతున్న ఆ చింతచెట్టు, తాము తాకకుండానే అలా ఎందుకు విరిగిపోతుందో తెలీక తెల్లమొహంతో... అయ్యో! తాము కొట్టాల్సిన చెట్లలో ఏదైనా అలా విరిగిపడిపోయి ఉండకూడదూ! రెక్కలు ముక్కలైపోయేలా కొడితే కాని దొరకని కూలీ ఉచితంగా దొరికి ఉండేది కదా! అని మబ్బు కమ్మిన మనస్సులతో ఆలోచిస్తున్న కూలీవాళ్ళ కోసమా అనేట్లుగా, తన చివరి రక్తపు బొట్టు, చివరి శ్వాస కూడా దేశానికి అంకితం చేస్తామని దొంగమాటలు చెప్పి వారి స్వార్థం పట్ల కలిగిన అసహనంతో ఆత్మాహుతి చేసుకునేందుకైనా సిద్ధమైన ఏ దళపు హత్యకో అయిష్టంగా బలయ్యే రాజకీయ నాయకుల్లా కాకుండా, తన చివరి జీవన క్షణాన్ని కూడా తన సహజీవి అయిన మానవుడికి సహాయం చేస్తూ గడపాలన్న తలంపుతో, కొట్టివేయాల్సిన ఓ చెట్టుపై పడి 'వెళదాం రా మిత్రమా!' అని దాన్ని కౌగిలించుకొని దానితో సహా విరిగిపడిపోయింది.

(ఆ చింతచెట్టు ఆత్మశాంతికై మౌనం పాటించడం కాక దాని ఆత్మఘోషలో ఏ వంతో చింతను మనం కూడా అందిపుచ్చుకోగలిగిన నాడే ఆ చింత చింత ఫలవంతమవుతుంది) ●

నవంబర్ 2002.. వరంగల్ జిల్లా ఏటూరునాగారం సమీపంలో క్లేమోర్‌మైన్‌తో ఆర్టీసీ బస్సుపేల్చివేత. 30 మంది దుర్మరణం..

అక్టోబర్ 2003.. తిరుమల ఘాట్‌రోడ్‌పై క్లేమోర్‌మైన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబుపై హత్యాయత్నం.

జూన్ 2001.. రంగారెడ్డి జిల్లాలో మందు పాతర్లు పేల్చి ఎస్ఐ, కానిస్టేబుల్ హత్య..

మార్చి 2000.. రంగా రెడ్డి జిల్లా ఘటకేసర్ సమీపంలో మందుపాతర పేల్చి రాష్ట్రమంత్రి ఎ. మాధవరెడ్డి దారుణహత్య..

విధ్వంసం సృష్టిస్తున్న

మందుపాతర

ఇటీవలి కాలంలో రాష్ట్రంలో తీవ్రవాదులు, ఫ్యాక్షనిస్టులు సాగిస్తున్న హత్యాకాండలో మందుపాతర్లు, క్లేమోర్‌మైన్స్ ప్రముఖపాత్ర వహిస్తున్నాయి. అంతర్జాతీయంగా అన్ని దేశాల్లోనూ విస్తరించిన మాఫియా గ్యాంగులు, లాభమే ధ్యేయంగా పనిచేసే కంపెనీలు, సామ్రాజ్యవాదులు వీటిని ప్రపంచవ్యాప్తం చేశారు. సులభంగా లభించే పేలుడు పదార్థాలు, అతి తక్కువ ఖర్చు, అంతగా కష్టంగాని సాంకేతిక పరిజ్ఞానం, చిన్న మైన్‌తో పెను విధ్వంసం సృష్టించగలడం వల్ల ఉగ్రవాద, విద్రోహశక్తులు వీటిని విరివిగా ఉపయోగిస్తున్నాయి. గత దశాబ్ద కాలంగా రాష్ట్రంలో మందుపాతరల వల్ల పెద్ద సంఖ్యలో పోలీసులు, రాజకీయ ప్రముఖులతో పాటు అమాయక పౌరులు కూడా అనేకమంది మృత్యువాత పడ్డారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, నిర్లక్ష్యం కూడా ఈ విధ్వంసాలకు కారణమవుతున్నాయి.

యుద్ధాల్లో శత్రు సైనికులను మట్టుపెట్టే ఉద్దేశంతో మొదటగా వీటిని వాడినా అమెరికా సామ్రాజ్యవాదుల పుణ్యాన దేశ దేశాల్లో తయారైన ఉగ్రవాదుల చేతికి ఇవి చేరాయి. ఈ రోజున ప్రపంచదేశాల్లో మందుపాతరలు ఉపయోగించని ఉగ్రవాద సంస్థ లేదు. ప్రభుత్వ అదుపాజ్ఞల్లో లేని ప్రయివేటు సంస్థలు విచ్చలవిడిగా తయారు చేయడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతో మందుపాతరల వినియోగానికి అడ్డు లేకుండా పోయింది. రెండవ ప్రపంచయుద్ధ కాలంలో పెరిగిన వీటి వినియోగం వియత్నాంపై అమెరికా



అమెరికా టెక్నాలజీ

తొలిసారిగా 17వ శతాబ్దంలో అమెరికాలోని కాలిఫోర్నియాలో గల 'ఎక్స్‌ప్లోజివ్ రీసెర్చ్ కార్పొరేషన్' క్లేమోర్‌మైన్స్ రూపొందించింది. ప్రస్తుతం పీపుల్స్‌వార్ నక్సలైట్లు తాము తయారుచేస్తున్న మందుపాతర, క్లేమోర్‌మైన్స్ టెక్నాలజీని ఎల్‌టిటిఇ వద్ద నేర్చుకున్నాయి. ఎల్‌టిటిఇకి తొలుత భారత రక్షకదళాలు ఈ మందుపాతర్ల తయారీ, వినియోగాన్ని నేర్పారు. అయితే ఆ తర్వాత శ్రీలంక వెళ్ళిన భారత శాంతి దళాలపైనే ఎల్‌టిటిఇ ఈ టెక్నాలజీని ఉపయోగించి దాడులు చేసింది. తిరుమలలో పీపుల్స్‌వార్ వినియోగించిన సాంకేతిక పరిజ్ఞానం అమెరికా తరహాలో ఉందని అభిప్రాయ పడుతున్నారు. అంతర్జాతీయ మాఫియాకు కేంద్రంగా ఉన్న అమెరికా నుండి ఉగ్రవాదులు, వేర్పాటువాదులు ఏ టెక్నాలజీ అయినా సులభంగా పొందగలుగుతున్నారు.

జరిపిన దురాక్రమణలో తారాస్థాయికి చేరింది. అమెరికా వియత్నాంను వదిలి 28 ఏళ్ళు కావస్తున్నా ఇప్పటికీ ఆనాటి యుద్ధం తాలూకు భయానక అనుభవాలు వారిని వెంటాడుతున్నాయి. అమెరికా పాతిపెట్టిన మందుపాతరలు పెద్ద సంఖ్యలో వియత్నాం పౌరులను ఇంకా బలి తీసుకుంటున్నాయి. అదేవిధంగా తనకు ఎదురు తిరిగిన దేశాల్లో తిరుగుబాట్లు లేవదీయడానికి అమెరికా పెంచిపోషించే ఉగ్రవాద సంస్థలకు కూడా మందుపాతరలను సరఫరా చేసింది.

ఈరోజున ప్రపంచవ్యాప్తంగా 70 దేశాల్లో 10 కోట్లకు పైగా మందుపాతరలు భూమిలో పాతి ఉన్నట్లు అంచనా. 1975 నుండి 10 లక్షలకు పైగా ప్రజలు వీటికి బలయ్యారు. అమెరికా లాంటి దేశాలు ఇతర దేశాలపై దాడి చేసినపుడు అక్కడ పాతిపెట్టిన మందుపాతరలను మరలిపోయేటపుడు తొలగించకపోవడం లేదా అవి పనిచేయకుండా నిర్వీర్యం చేయక పోవడం వల్లనే ఇటువంటి దుష్పరిణామాలు సంభవిస్తున్నాయి. ఈ విధంగా మందుపాతరలు అమాయక పౌరులను బలితీసుకుంటుండంతో వీటికి వ్యతిరేకంగా 1996లో ఒక ఉద్యమమే బయల్దేరింది. 120 స్వచ్ఛంద సంస్థలు ప్రారంభించిన ఈ ఉద్యమానికి జోనీ విలియమ్స్ అనే మహిళ సారథ్యం వహించారు. కెనడాలోని ఒట్టావాలో 1997లో కుదిరిన మందుపాతరల వ్యతిరేక ఒప్పంద ఫలితంగా ఆమెకు ఆ ఏడాది నోబుల్ శాంతి బహుమతి కూడా లభించింది. ఒట్టావా ఒప్పందాన్ని ఇప్పటి వరకు 136 దేశాలు అంగీకరించాయి. తొలిగా అమెరికా ఈ ఒప్పందంపై సంతకం చేయడానికి నిరాకరించింది. తమ దేశానికి ఎటువంటి ప్రమాదం లేదని భావించేవరకు మందుపాతరలు తయారుచేయడం, వినియోగించడం మానేది లేదని కరాఖండిగా చెప్పింది. ఇరుగు పొరుగు దేశాలైన ఇండియా, పాకిస్తాన్, చైనాలు కూడా ఈ ఒప్పందానికి అంగీకరించలేదు. ప్రస్తుతం 40 దేశాలు వీటిని ఉత్పత్తి చేసి వినియోగిస్తున్నాయి, వీటితో వ్యాపారం చేస్తున్నాయి. శ్రీలంకలో ఎల్‌టిటిఇతో పోరాడుతున్న ఆ ప్రభుత్వం కూడా మందుపాతరల నిషేధానికి అంగీకరించలేదు. అయితే గత ఏడాది శ్రీలంకలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన దరిమిలా మందుపాతరల నిషేధ ఒప్పందానికి కట్టుబడటానికి శ్రీలంక ప్రభుత్వం, ఎల్‌టిటిఇ అంగీకరించాయి. శ్రీలంకలో 7 లక్షల మందుపాతరలు భూమిలో పాతిపెట్టబడి ఉన్నాయని ఆ దేశ రక్షణమంత్రి ప్రకటించారు. అక్కడ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత మందుపాతరలను తొలగించడానికి లేదా నిర్వీర్యం చేయడానికి శ్రీలంక ప్రభుత్వం ఉపక్రమించింది. ఇందుకు అంతర్జాతీయ సహకారం కూడా లభిస్తోంది. శ్రీలంకలో 20 ఏళ్ళపాటు సాగిన వేర్పాటు ఉద్యమానికి 70 వేల మందికి పైగా పౌరులు హతమయ్యారు. అంతకు రెట్టింపు సంఖ్యలో వికలాంగులయ్యారు.

ఇప్పటికే ప్రపంచమంతా వ్యాపించిన అమెరికా మందుపాతరలతోనే ప్రజలు అల్లాడుతుంటే అమెరికా యుద్ధతంత్ర నిపుణులు మరింత ఆందోళన కలిగించే ప్రయోగాలు చేస్తున్నారు. తమ దేశ భద్రత కోసమంటూ గాలిలో ఎగిరే హెలికాప్టర్లను రెప్పపాటులో పేల్చివేసే మందుపాతరల ఉత్పత్తికి రంగం సిద్ధం చేస్తున్నారు. రానున్న దశాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా 10 లక్షల యాంటీ హెలికాప్టర్ మైన్స్ ఉత్పత్తి జరుగుతుందని





ల్యాండ్‌మైన్ క్లేమోర్‌మైన్



మనం మందుపాతర (ల్యాండ్‌మైన్) గా పేర్కొనే వీటి సాంకేతికనామం ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్ (ఐఇడి). సాధారణంగా సైనిక అవసరాలకు వినియోగించే మందుపాతర్లను పీపుల్స్‌వార్ స్వంత టెక్నాలజీతో బక్కెట్లు, టిఫిన్‌బాక్స్‌లతో తయారు చేసి భూమిలో పాతి ఆ రోడ్డు వెంట వెళ్ళే లక్ష్యాల(వాహనాలు)ను పేల్చివేస్తోంది.

ల్యాండ్‌మైన్‌లో వినియోగించే రసాయన, పేలుడు పదార్థాలతోనే క్లేమోర్‌మైన్స్ తయారుచేస్తారు. అయితే వీటిని భూమిలో పాతడం కాకుండా చెట్లకు, భూమిపైన ఎత్తైన ప్రదేశాల్లో ఏటవాలుగా అమర్చి లక్ష్యాలను ధ్వంసం చేస్తున్నారు. ల్యాండ్‌మైన్స్, క్లేమోర్‌మైన్స్‌ను రిమోట్ లేదా బ్యాటరీల సాయంతోనూ పేల్చవచ్చు. అయితే నక్సలైట్లు ఎప్పుడూ బ్యాటరీ, వైర్ల సాయంతోనే పెను విధ్వంసం సృష్టిస్తున్నారు. ఇవి వత్తిడి వల్ల కూడా పేలతాయి.

అటకెక్కిన రాష్ట్రప్రభుత్వ ప్రతిపాదన

రాష్ట్రమంత్రి ఎ. మాధవరెడ్డిని పీపుల్స్‌వార్ నక్సలైట్లు మందుపాతరతో దారుణంగా హత్య చేసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఒక ప్రతిపాదన పంపింది. పేలుడు పదార్థాల తయారీదారులకు లైసెన్స్‌లు ఇచ్చే అధికారం కేంద్రానికే ఉంది. మందుపాతర్లు, క్లేమోర్‌మైన్స్‌లో వినియోగించే డిటోనేటర్లు స్విచ్ నొక్కగానే పేలకుండా కొద్ది సేపటి తర్వాత పేలే విధంగా తయారు చేసేవిధంగా ఆయా కంపెనీలను నియంత్రాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ప్రయివేటుగా తయారయ్యే పేలుడు పదార్థాలనే పీపుల్స్‌వార్ నక్సలైట్లు సేకరించి విధ్వంసం సృష్టిస్తున్నారు. రాష్ట్రం పంపిన ఈ ప్రతిపాదన ఏ దశలో ఉందో తెలియదు.

ధ్వంసమైన కారునుండి ముఖ్యమంత్రిని బయటకు తీసుకువస్తున్న దృశ్యం

అమెరికా నిపుణులు చెబుతున్నారు. ఇందులో 3 లక్షలు ఒక్క అమెరికాలోనే తయారు చేస్తారని, మరో 3 లక్షలు యూరప్‌లో, మిగిలిన 4 లక్షలు ఇతర దేశాలు తయారు చేస్తాయని అమెరికా నిపుణులు పేర్కొంటున్నారు. రానున్న కాలంలో ఈ మందుపాతరలకే ప్రాధాన్యత, డిమాండ్ పెరుగుతుందని, దానికనుగుణంగానే ఆయుధ ఉత్పత్తిదారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారని చెబుతున్నారు. అమెరికాకు చెందిన 'సైన్స్‌టెక్‌లైబ్రరీడాట్‌కామ్' అనే వెబ్‌సైట్ ఈ విషయాలను పేర్కొంది. ప్రస్తుతం రోడ్డుమీద వెళ్ళే వాహనాలకే పొంచి ఉన్న ముప్పు రానున్నకాలంలో ఆకాశంలో వెళ్ళే హెలికాప్టర్లను కూడా వదలకపోతే జరిగే అనర్థాలు ఊహించగలమా?

ప్రపంచవ్యాప్తంగా మాదకద్రవ్యాలు రవాణా చేసే మాఫియా ముఠాలకు, అక్రమ ఆయుధాల అమ్మకం దారులకు ఉన్న అవినాభావ సంబంధం విడదీయలేనంతగా పెనవేసుకుపోయింది. నేడు 360 రకాల మదుపాతరలను 100 ప్రయివేటు, ప్రభుత్వరంగ సంస్థలు ఉత్పత్తి చేస్తున్నాయి. మిలిటరీ అవసరాల కోసం ఉత్పత్తి చేసే ప్రభుత్వరంగ సంస్థలు, అక్రమంగా అమ్ముకునే ప్రయివేటు సంస్థలు లెక్కలు సరిగా ఇచ్చే అవకాశం లేనందున మందుపాతరలు ఎన్ని ఉత్పత్తి అవుతున్నాయనే దానిపై నిర్దిష్టమైన సమాచారం లభ్యం కావడంలేదు. అయితే అమెరికా రక్షణశాఖ లెక్కల ప్రకారం 62 దేశాల్లో 6.5 కోట్ల నుండి 10 కోట్ల వరకు కంట్రోల్డ్ మైన్స్ ఏర్పాటు చేయబడ్డాయని తెలుస్తోంది. అయితే నిర్వీర్యం చేయని మందుపాతరలు 20 కోట్లకు పైనే ఉండవచ్చని ఇతర సమాచార వర్గాలు పేర్కొంటున్నాయి. గత 15 సంవత్సరాలుగానే వీటి వినియోగం విపరీతంగా పెరిగింది. మందుపాతరల వాడకం ఇంత భారీగా ఉన్నప్పటికీ ఆయుధాల వ్యాపారంలో వాటి వాటా చాలా తక్కువగా చూపిస్తున్నారు. ఏటా వీటి వ్యాపారం 10 కోట్ల అమెరికా డాలర్లు మాత్రమేనని అధికారికంగా చెబుతున్నారు. గతంలో మందుపాతరల ఎగుమతిలో అమెరికాదే అగ్రస్థానం. ప్రధానంగా ఇరాన్, కాంబోడియా, థాయ్‌లాండ్, చిలీ, ఎల్ సాల్వడార్, మలేసియా, సౌదీ అరేబియా దేశాలకు అమెరికా మందుపాతరలు ఎగుమతి చేసేది. ప్రస్తుతం ఈజిప్టు, ఇజ్రాయిల్, పాకిస్తాన్, సింగపూర్, స్వీడన్, యుగోస్లావియా తదితర దేశాలు కూడా ప్రధాన ఎగుమతిదారుల జాబితాలో చేరాయి.

ప్రపంచమంతా ఒక గ్రామంలా మారిపోయిన ఈ తరుణంలో మందుపాతరలకు వ్యతిరేకంగా ఎన్ని ఒప్పందాలు చేసుకున్నా ఫలితం శూన్యం. అన్నింటినీ అంగడి సరుకులుగా మార్చేస్తున్న పాలకుల విధానాలు మారినపుడు ఈ ఒప్పందాలతోనే పని ఉండదు. ●



70 దేశాల్లో మందుపాతరలు

ప్రపంచ వ్యాప్తంగా 10 కోట్లకు పైగా మందుపాతరలు 70 దేశాల్లో భూమిలో ఉన్నాయి. ఇవి సరిహద్దుల్లో, ఉగ్రవాద ప్రభావిత ప్రాంతాల్లోనూ పాతి ఉన్నాయి. అమెరికా సామ్రాజ్యవాదులు సాగించే అకృత్యాల్లో మందుపాతరలు అమర్చడం కూడా ఒకటి. అది దాడిచేసిన ఆనాటి వియత్నాం నుండి ఈనాటి ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ వరకు ప్రతి దేశంలోనూ లెక్కలేనన్ని మందుపాతరలు పాతింది. 1975 నుండి ఇప్పటివరకు వీటి వల్ల 10 లక్షలకు పైగా ప్రజలు బలయ్యారు. ఇంకా బలవుతూనే ఉన్నారు.

వియత్నాంపై దురాక్రమణ జరిపి భంగపడిన అమెరికా సామ్రాజ్యవాదులు 1975లో అక్కడి నుండి పలాయనం చిత్తగించారు. దాడి సందర్భంగా వియత్నాంలో అమెరికా సైన్యం పాతిన మందుపాతరలు ఇప్పటికీ వియత్నాం పౌరులను బలి తీసుకుంటూనే ఉన్నాయి. అమెరికా సైన్యం పారిపోతూ వియత్నాంలో వదిలేసిన మందుపాతరలు 35 లక్షల వరకు ఉంటాయని అంచనా. 1975 నుండి ఇప్పటివరకు దాదాపు 40 వేల మంది వియత్నాం పౌరులు వీటికి బలయ్యారు. 64 వేల మంది వికలాంగులయ్యారు. ప్రతినెలా వియత్నాంలో కనీసం 180 మంది మరణిస్తున్నారని అమెరికా ప్రభుత్వం ఇటీవల స్వయంగా అంగీకరించింది. వీరిలో ఎక్కువమంది పిల్లలే ఉండటం గమనార్హం.

✳ ముదిగంటి సుజాతారెడ్డి

విశిష్టమైన కుటుంబం వ్యవస్థ

"ఏమైంది లల్లీ! చాలా రోజులైంది కనపడలేదు" అడిగాన్నేను ఇంట్లోకి వస్తున్న లలితను చూసి.

"మా అత్తగారు ఊర్నుంచి వచ్చింది. ఆమెను డాక్టరుకు చూపించి టెస్టులంటే అవి చేయించి మందులు కొనిచ్చి ఊరికి తోలేసరికి ఇదిగో ఇప్పుడు తీరికయింది." ఏముంది! వయస్సు మీద పడింది. ఏదో ఒకటి ఉంటుంది. ఎండాకాలంలో ఎండల వేడి! ఆ వేడి పడక దాని ప్రభావంతో నీరసం! షుగరున్న మనిషి కద! ఏవో బాధలు. డాక్టరుకు చూపించుకోవాలి చూపించుకోవాలి అనుకుంటూనే ఆలస్యం చేసి ఇప్పుడు వచ్చింది. డాక్టరదే అన్నాడు శరీరంటో డీహైడ్రేషన్‌తో వచ్చిన ప్రాబ్లం అని..."

''ఎందుకట్లా ఆలస్యం చేసింది-'' అడిగాన్నేను.

"అదీ కొడుకు పట్నం వచ్చి డాక్టరుకు చూపించుకో అని వెంబడి పడితే వచ్చింది. నెల రోజులు ఇక్కడే వుండి విశ్రాంతి తీసుకునే వరకూ ఆయన వదలలేదు."

''మనం పెద్ద వాళ్ళను అట్లా చూసుకుంటున్నాం కాబట్టే ఎంతోమంది ఓల్డేజీ హోముల్లో వుండవలసిన అవసరం రావడం లేదు. లేకపోతే పాశ్చాత్య దేశాల్లో లాగా ఓల్డేజ్‌లో ఓల్డేజ్ హోముల్లో వుండాలంటే ఎన్ని ఓల్డేజ్ హోములైనా సరిపోవు మనకు!" అన్నాన్నేను.

"పాపం! ఆ ఓల్డేజ్ హోముల్లో ఏం జీవితమే. నా అన్నవాళ్ళు వుండగా వాళ్ళకు దూరంగా అనాథల్లాగా వుండడం... తల్చుకుంటేనే ఒళ్ళు గగుర్పొడుస్తుంది" అంది లలిత ఒళ్ళు అంతా ముడుచుకుంటూ.

"అదేనే! మొన్న ఏమైంది... యూరపులో... వృద్ధులు ఫ్రాన్సు దేశంలో పదివేలకు పైగా, ఇటలీలో నాలుగు వేలకు పైగా దిక్కూ దివాణం లేకుండా ఎండాకాలంలో వేడికి తట్టుకోలేక... సమయానికి వైద్యం అందక చనిపోయారు.." నా మాట పూర్తికాక ముందే లలిత అందుకుంది.

"అదేందే! అంత అభివృద్ధి చెందిన దేశాలు. ఎండాకాలం వేడికి తట్టుకోలేక అంటావు" అంది.

ఈసారి ఎండాకాలంలో అక్కడ ఎండలు బాగా వున్నాయట. వేడి కూడా పెరిగిపోయింది. వాళ్ళ దగ్గర హీటర్లు.. సెంట్రల్ హీటింగులే వుంటాయి. ఎందుకంటే చలిదేశం చలి నుంచి కాపాడే వేడినిచ్చే హీటర్లే వుంటాయిగాని ఏసీలు, ఫ్యాన్లు వుండవు. దాంతో ఆ వేడిని తట్టుకోలేక వృద్ధుల ఆరోగ్యం చెడిపోయింది. చాలా మంది ఒంటరిగా వుంటారు. లేదా ఓల్డేజ్ హోముల్లో వుంటారు. అది ఎండాకాలం కాబట్టి చాలా మంది సెలవులనీ ఎంజాయ్ చేయడానికి వెళ్ళిపోయారు. వేడి నుంచి పారిపోవడానికి ఏ సముద్ర తీరానికో, నదీ తీరాలకో ఈతలు కొడ్తూ ఎంజాయ్‌చేయడానికి వెళ్ళిపోయారు. యూరపులో ఎండాకాలంలో మూడు నాలుగు వారాలు సెలవులు తీసుకొని అట్లా వెళ్ళిపోవడం అలవాటు. అట్లా సెలవు తీసుకోకుండా వుండడానికి ఎంప్లాయర్లు కూడా ఒప్పుకోరు. సెలవులు తీసుకొని ఆఫీసులు, కర్మాగారాల పని మరచిపోయి ఎంజాయ్ చేస్తేనే తిరిగివచ్చి నూతనోత్సాహంతో పని చేస్తారని అనుకుంటారు.

ఎవరైనా ఖర్చవుతుందనో, డబ్బు సేవ్ చేయాలనో సెలవులకు ఎక్కడికైనా వెళ్ళకపోతే వాళ్ళను గురించి మిగతా వాళ్ళు చెవులు కొరుక్కుంటారు మరి! అందుకని తప్పకుండా సెలవులకు పోవలసిందే! అట్లా చాలా మంది సెలవులకు వెళ్ళిపోయారట. దాంతో ఒంటరిగా వున్న వృద్ధులను చూసుకోవడానికి పిల్లలు, బంధువులు, ఓల్డేజ్ హోముల్లో వున్న వృద్ధులను చూసుకోవడానికి సిబ్బందిగాని లేరట! చివరకు ఆ వృద్ధులను ఎట్లాగో అట్లాగా ఆస్పత్రులకు చేరవేస్తే అక్కడ వాళ్ళకు వైద్యం అందించే వాళ్ళు ఆస్పత్రులో ఎక్కువ మంది లేరట! దాంతో తోడునీడ లేక వైద్య సహాయం లేక వృద్ధులెందరో చనిపోయారు!"

నా మాటలు విని, "మన దగ్గరే నయమే. పెద్ద వాళ్ళను చూసుకుంటాం. బాగోగులు కనుక్కుంటాం. డబ్బు వుండగానే సరిపోయిందా! వృద్ధాప్యంలో ఎవరైనా ఆసరా వుండాలి అనుకుంటాం!" అంది లలిత.

''అక్కడ ఇంకోటే లల్లీ! పిల్లలకు పద్దెనిమిదేళ్ళు రాగానే ఇంట్లోంచి ఆ పిల్లలు వెళ్ళిపోతారు. ఉద్యోగాలు చేస్తారు. స్వతంత్రంగా వుంటారు. లేదా బ్యాంకు లోనో, స్కాలరు షిప్పుల మీదనో పై చదువులు చదువుతారు. వాళ్ళ పెండ్లిళ్ళు వాళ్ళే వధూవరులను వెతుక్కొని చేసుకోవాలి! ఈ బాధ్యతల్తో యువత వాళ్ళ సమస్యలు, జీవితాల్లో మునిగిపోతారు. పెద్దవాళ్ళను వృద్ధులను చూసుకోవాలనే బాధ్యతను ఫీల్‌కారు..." అని చెప్తుండగా లలిత అందుకుంది – "మన దగ్గరే, పిల్లల చదువులు పెండ్లిళ్ళు అన్ని బాధ్యతలూ తల్లిదండ్రులే చూసుకుంటారు. కుటుంబం ఒక్కచోట వుండాలి. సంప్రదాయం అంటూ మనం కలిసిమెలసి వుంటాం. అట్లా పద్దెనిమిదేళ్ళకే పిల్లలు వేరుపడడం మనమూహించలేం సుశీ! అవునా!... ఇప్పుడేదో ఉద్యోగాలు అని చెప్పి కొడుకులు దూరంగా వేరే పట్టణాల్లో, వేరే దేశాల్లో వుంటున్నారుగారు గాని లేకపోతే మన దగ్గర కుటుంబమంతా కలిసే వుండేవాళ్ళు. దానివల్ల కొన్ని కష్టనష్టాలున్నా... నువ్వు చెప్పేది వింటుంటే ఆ పద్ధతే మంచిదేమోనే!" అంది లలిత.

"నువ్వు చెప్పింది నిజమే లల్లీ! ఈ కాలంలో దూరంగా వున్నా అప్పుడప్పుడు కలుసుకోవడం, తల్లిదండ్రులు, వృద్ధుల పట్ల బాధ్యతను ఫీల్‌కావడం వుంది. దానివల్ల వృద్ధాప్యంలో ఒంటరితనం, నిస్సహాయతల్లేకుండా వుంటుంది. అందుకే గద మన వంటి ప్రాచ్యదేశాల్లో వున్న కుటుంబ వ్యవస్థ పాశ్చాత్యులను ఆకర్షిస్తున్నది! పాఠాలను నేర్పుతున్నది!" అన్నాన్నేను లలిత వైపు చూస్తూ. ●

నా చిరునామా ఎక్కడ ?

ఎద్దునై
పొలం గుండెకు పులకింతలు నేర్పాను.
నాగలినై
నేలగుండె లోతులను కొలిచాను
కళలను పలికించాను
కమ్మరినై
కర్రు గౌగిళ్ళతో
పుడమి తల్లిని సిరుల తల్లిని చేశాను
నేత పనివాడినై
మగ్గాన్ని మాట్లాడించాను
మానం నిలపే బట్టగా మారి
మర్యాద కళలను నేశాను
మండుటెండల్లో
విడువకుండా పట్టిన ముసురు వానల్లో
డొక్కలెగిరించే చలిలో
రాళ్ళు కొట్టి కంకర పుట్టించి
మన్ను మోసి
బెండడి అందించి
నాగరికత భవనానికి
కూలి ఇటుకగా మారి
పునాదులు వేశాను
మూటలు మోసీమోసీ
నావీపు బండరాయయింది
పనిముట్లు పట్టిన చేతులు
పనికాయలు పరచుకొన్న నేలయింది
నా శ్రమను దోచుకున్న నాగరికత
సుందర తాజమహలై కులుకుతుంది
శ్రమను బానిసగా చేసుకొన్న నాగరికతకు
నా శరీరం అంటరానిదయ్యింది
నా శ్రమతో అందాన్నీ - ఆరోగ్యాన్నీ
పుష్టినీ పండించుకొన్న ప్రజాస్వామ్యం
కన్నీళ్ళ హారాలను కాన్కగా ఇచ్చింది
నన్ను తోట కసింద పొదల్లో పొర్లించి
చోద్యం చూస్తుంది
రామ ప్రజాస్వామ్య రాజ్యం
కడుపులో పెట్టుకొని
కాపాడుతుందనుకొంటే
ప్రపంచీకరణ కాలసర్పంతో
మల్లయుద్ధం చేయమని
గోదాలోకి దింపింది
బలిసిన తోడేలుకు
బక్కమేకలాంటి నన్ను ఎరగా వేసింది
ప్రైవేటీకరణ తుపానుతో
సంక్షేమ రహదారి
కోసుకుపోయి రాళ్ళు తేలింది
దారి పొడుగునా
దారి పక్కల్లో
దారి గుండెల్లో
బతుకు నేలలో
పల్లేరు కాయలు కాశాయి
పాదాలను చీల్చాయి
పూసిన కింశుక వృక్షంలా వున్న నన్ను చూచి
కేరింతలు కొడుతుంది ప్రజాస్వామ్యం
హైటెక్ అభ్యుదయ దార్శనికత్వంతో
సంక్షేమం
సమ్(some)ను అధిగమించి
మోర్ (More) క్షామమై తినేసి
నా చిరునామా లేకుండా చేస్తుందా!

- వల్లభాపురం జనార్ధన

అమ్మ భుజాలు

నా దేశంలో
ప్రతి వస్తువు తయారీ వెనుక
డొక్క లెండిన ఓ కార్మికుడు

నా దేశంలో
రెపరెపలాడే పట్టుబట్టల వెనక
పెట్టుబడిదారీ మార్మికుడు.

ఈ ఇద్దరి బిడ్డల్ని
భుజాన వేసుకొని
మౌనంగా భారతమ్మ

- పి.ఆర్.ఎల్.స్వామి

✻ సైదులు ఐనాల

మధ్యాహ్నం లంచ్ తొందరగా ముగించేసి స్టాఫ్‌రూంలో కూర్చొని న్యూస్ పేపర్ తిరగేస్తున్నాను. పిల్లలంతా స్కూలు ఆవరణలో ఆటలాడుతున్నారు. అరుపులు, కేకలు, ఏడ్వడం, సార్‌కి చెప్తానని బెదిరింపులు, బుజ్జగింపులతో నిండింది. "సార్... సార్..." మా అటెండర్ మైసయ్య పిలుపుతో ఉలిక్కిపడ్డాను.



పిల్లల సందేహాలు తీర్చాలి

"అయ్యో! మీరేదో ఊరకనే ఉన్నారనుకున్నా, ఏదో చాలా సీరియస్‌గా చదువుతున్నారనుకుంటా? మళ్ళీ వస్తాన్లే సారూ!" అంటూ వెళ్ళిపోబోతుంటే "అబ్బే అదేం లేదు మైసయ్యా ఏంటి విషయం?" అన్నాను.

"అదే... అదే మరేం లేద్సార్" మాటల్ని మధ్యలోనే ఆపి అటుఇటు చూసి మిగతా సార్లు ఎవ్వరూ లేరని నిర్ధారణ చేసుకొని మొదలెట్టాడు. (ప్రతి చిన్న విషయం అడిగి విసిగిస్తాడు. అలా అంటే ఫీలవుతాడు. ఎంత అమాయకుడో పాపం మైసయ్య ప్చ్ అంటాంటారు నా కొలీగ్స్. అందుకేనేమో అటూ ఇటూ చూసి మరీ మాటల్లో దిగాడు)

"సార్ నేనడిగేది చిన్నవిషయమనో, ఓస్ ఇంతేనా? అనో అనరు కదా!?" అన్నాడు.

"అడగవోయ్! అన్నాను" ఏ మాత్రం ఆలస్యం చేయకుండా "సార్ ఇదేం మొక్క" అన్నాడు తన చేతిలో పట్టుకొచ్చిన మొక్కను చూపిస్తూ. "ఊహూం పర్లేదే మైసయ్య అనుకొని అదా పత్తి పత్తి అన్నాను."

"ఏది వాటి ఆకుల్ని పట్టుకుని చూడండి సారూ'' అన్నాడు. ఆకుల్ని టచ్ చేయగానే ముడుచుకున్నాయి.

"ఎందుకట్లా ముడుచుకుంటున్నయ్! సారూ!?" తూటాలా వచ్చేసింది ప్రశ్న. అసలు ఆ మొక్కని చూసే ఊహించాను. ఆ ప్రశ్నని. కాకపోతే ఏ పదో తరగతో చదివే పిల్లాడికైతే అంతే స్పీడుగా చెప్పొచ్చు" పీడనాలు, కుంచిత చలనాల వల్ల అలా జరుగుతుందని. కానీ ఎప్పుడో ఎనిమిదో తరగతి చదివిన మైసయ్య కెట్లా చెప్పేది? క్షణకాలం ఆలోచించి "మైసయ్యా నీకీ ఆలోచన ఎందుకొచ్చిందీ!" అన్నాను.

"ఏం చెప్పను సారూ. ఒకటేంటి వంద ప్రశ్నలేత్తాడు నా కొడుకు. చెప్పలేక నే సత్తన్న. చెప్పకపోతే బువ్వతిననని మంకు పడ్తాడాడు" అన్నాడు.

"నీ కొడుకెన్ని చదువుతున్నాడు మైసయ్యా!" అన్నాను ఉత్సాహంగా. "ఎన్నోనా! మొన్ననే రెండో తరగతి పుస్తకాలు కొనిచ్చిన" అన్నాడు. రెండో క్లాస్ అంటే ఆరేడు సంవత్సరాలుండొచ్చు అనుకున్నాను. అదే చెప్తే అవును సారూ అన్నాడు.

సరేగానీ మైసయ్యా దాని గురించి నేనే నీ కొడుకుతో చెప్తా రేపు మన బడికి తీసుకురా" అన్నాను. మా హైస్కూల్ ప్రైమరీ స్కూల్‌కి కొద్ది దూరంలోనే ఉండటం వల్ల మర్నాడు మైసయ్య వాళ్ళబ్బాయిని తీసుకొచ్చాడు. "నీ పేరేంటి ?" "శివరామ్" "మీ నాన్న పేరు?" "మైసయ్య" "మీ అమ్మ పేరు?" "సత్యవతి" ఏ మాత్రం బిడియం లేకుండా సమాధానాలిస్తుంటే ఆశ్చర్యపోయాను. ఆ తరువాత వాడికొచ్చే రోజువారీ సందేహాలన్నింటినీ తీర్చేశాక ఎంతో సంతోషంతో గంతులేశాడు.

"బడిగంట కొడ్తారు. నేపోతా సార్" అంటూ తుర్రుమన్నాడు. ఇక ఆ రోజు నుండి ఆ తరహా ప్రశ్నలకు జవాబులు వెతుక్కోవడం నా రోజు వారీ పనుల్లో ప్రధానమైంది. ఒకటేమిటి కాకి నల్లగా ఎందుకున్నదీ! తెల్లగా, ఎర్రగా ఉండవా? లాంటి ప్రశ్నల లగాయతు మనకి ఆవుల్లా కొమ్ములేవు ఎందుకు?" వరకు అనేకం.

ఇది ఒక్క శివరామ్‌లోనే కాదు. బాల్యంలో ప్రతీ పిల్లవానికీ ఉంటుంది. సహజంగా పిల్లలు పెద్దల్ని అనుకరిస్తారు. అంతేకాదు తాను చూసింది, విన్నది అట్టే పట్టేస్తారు. ప్రతీ విషయాన్నీ, ప్రతీ దృశ్యాన్ని పరిశీలనగా పరిశీలిస్తారు. వాళ్ళ చిన్న బుర్రకు సమాధానం తెలియకపోతే పెద్దవాళ్ళను అడుగుతారు. ఓపికగా వాళ్ళకు సమాధానం చెప్పి వాళ్ల ఆసక్తిని గమనిస్తూ మరింత ప్రోత్సహించాలేకానీ విసిగించకురా, పోరాపో బయటికి వెళ్ళి ఆడుకో వెళ్ళు, అమ్మ అప్పలు వండుతుంది తిను" వంటి మాటలతో వాళ్ళ దృష్టిని మరల్చకూడదు. దానివల్ల వాళ్ళలో పరిశీలనా గుణం, విషయం పట్ల ఆసక్తి, ఏకాగ్రత కోల్పోతారు. మనకు చిన్నదనే విషయం వాళ్ళ చిన్నబుర్రకు పెద్దగానే ఉంటుందన్న ప్రాథమిక అవగాహనుండాలి. లేకపోతే మనం ప్రదర్శించే విసుగు, చిరాకు, కోపం చిన్న పిల్లల్లో ద్వేషాన్ని, మొండితనాన్ని నింపుతుంది. అంతేకాదు పసిపిల్లల హృదయాలు గాయపడనూవచ్చు. అనేకానేక విషయాలపై సందేహాలొస్తుంటాయి. బల్లి పురుగును పట్టడం, కాకి ఎంగిలి మెతుకులు తినడం, కోడిపుంజు కూత, ఇలా ఒకటేమిటి ప్రతీ దృశ్యం పిల్లల్ని ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా పిల్లలకు కథలంటే ఇష్టంగా ఉంటారు. అద్భుతాలన్నీ ఆశ్చర్యకర సంఘటనలంటే అంతులేని ఉత్సాహాన్ని చూపిస్తారు. అప్పుడు పెద్దలు (ఇంటిదగ్గర తల్లిదండ్రులు, స్కూల్లో టీచర్) మెళకువతో మెలగాలి. ఎక్కడ ఏ లోపం జరిగినా పిల్లల్లో మొండితనం అంకురించే ప్రమాదం ఉంది. పరిశీలనా జ్ఞానం అనేది పిల్లల్లో సృజనాత్మకతను పెంచుతుంది. ఇది బాల్య దశలోనే చిగురిస్తుంది. అందుకే వాళ్లపై చిన్నచూపు తగదు. నేటి బాలలే రేపటి పౌరులు. ఎంత చెట్టుకు అంతగాలి అన్నట్లు ఆ చిన్న బుర్రలకి ప్రతిదీ ఓ పజిల్. దాన్ని విప్పి విడమర్చి చెప్పడం పెద్దవాళ్ళ బాధ్యత, అవసరం కూడాను. ●

✻ పి.ఎం.సుందరరావు

బాలలకథ

మారిన బుద్ధి

కోసలరాజ్యానికి దక్షిణ భాగానగల అడవికి దుష్టబుద్ధి అనే సింహం రాజుగా వుండేది. దానికి రాజుననే గర్వం ఎక్కువ. అందువల్ల అడవిలో కనపడిన జంతువునల్లా తింటుండేది. దాని చర్యలకు జంతువులన్నీ ప్రాణభయంతో గజగజ వణికి పోయేవి. ఎంతకాలం గడిచినా దుష్టబుద్ధి ప్రవర్తనలో మార్పురాలేదు.

ఓ రోజు ఆ అడవిలోని జంతువులన్నీ పెద్ద చెట్టుకింద సమావేశమయ్యాయి. దుష్టబుద్ధి బారినుండి తమను తాము ఎలా కాపాడుకోవాలా అని తర్కించుకోవటం మొదలు పెట్టాయి. దుష్టబుద్ధి బలమైనది కాబట్టి దానిని ఎదిరించి బతకలేమని కొన్ని జంతువులు చెప్పాయి. "అయితే మనం ఈ అడవి నుండి వేరే చోటుకి వెళ్లి బతుకుదాం" అన్నాయి మరికొన్ని జంతువులు. చివరకు జంతువులన్నీ కలసి ఆ అడవినుండి దూరంగా ఉత్తరభాగం అడవికెళ్లి జీవించసాగాయి.

ఈ విషయం దుష్టబుద్ధికి తెలిసింది. అడవి అంతా తిరిగిచూసింది. ఏ ఒక్క జంతువూ కనిపించలేదు. 'అవి లేకుండా నేనొక్క దానిని బతకలేనా?' అన్న ధీమాతో కొంతకాలం ఒంటరిగానే గడిపింది. ఆ అడవిలో ఏ ఒక్క జంతువూ కనిపించకపోయేసరికి ఏదో వెలితిగా అనిపించింది. మాట్లాడటానికి, కుశల ప్రశ్నలు వేయటానికి ఒక చిన్న జంతువైనా కనిపిస్తే బాగుండుననుకుంది.

ఒంటరిగా వుండడంతో దుష్టబుద్ధికి ఏమీతోచేదికాదు. పిచ్చిపట్టినట్టుగా అనిపించేది. ఓసారి అలా ఆకాశంలోకి చూస్తుండగా పక్షులన్నీ గుంపుగా వెళుతూ కనిపించాయి. వాటిని "మీరంతా ఎక్కడికెళుతున్నారు?" అని అడిగింది. పక్షులకు వినపడినా దాని మాటలు పట్టించుకోలేదు. " దయచేసి మీరు ఎక్కడికి వెళుతున్నారో చెప్పండి. నాతో ఒక్క మాట మాట్లాడండి. మీకు పుణ్యం వుంటుంది" అంది బిగ్గరగా ఏడుస్తూ.

ఒక పక్షి జాలిపడి కిందికి దిగి "మృగరాజా! ఉత్తరభాగానగల అడవికి వెళుతున్నాం. అక్కడ ఈ రోజు వేడుక జరుగుతోంది. చాలా గొప్పగా వుంటుంది. అందుకే వెళుతున్నాం' అని చెప్పి రివ్వున ఎగిరిపోయింది.

ఆ మాటలు వినగానే దుష్టబుద్ధికి కూడా అక్కడకు వెళ్లి వేడుక చూడాలనిపించింది. అలా పిలవని పేరంటానికి వెళితే అక్కడి మృగరాజు దృష్టిలో చులకనవుతానని మారువేషంలో వెళ్లాలని నిర్ణయించుకుంది. తన నివాసంలో వున్న పెద్ద పొట్టేలు చర్మాన్ని శుభ్రంచేసి, కప్పుకుని బయలుదేరింది.

ఉత్తరభాగాన వున్న అడవికి చేరుకుంది. మెల్లగా వేడుక జరిగేచోటుకి వెళ్లింది. అక్కడంతా కోలాహలంగా వుంది. చిన్న, పెద్ద జంతువులన్నీ భేదాలు మర్చిపోయి సంతోషంగా ఒకదానినొకటి అభినందించుకుంటూ, శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఉల్లాసంగా వున్నాయి.

పొట్టేలు తోలు కప్పుకున్న దుష్టబుద్ధిని ఏ జంతువూ గుర్తుపట్టలేదు. అక్కడున్న జంతువులలో ఎక్కువ భాగం, తన అడవిలోని జంతువులేనని గుర్తించింది. అవన్నీ అక్కడ సంతోషంగా వున్నాయి. ఆ పండుగ వాతావరణాన్ని చూడగానే దుష్టబుద్ధికి హుషారు వచ్చింది. అదికూడా అన్నిటితో కలిసిపోయి ఆడిపాడి ఎగిరింది. మరుసటిరోజుకు దుష్టబుద్ధిలో మార్పు వచ్చింది.



వెంటనే అక్కడి రాజైన సుబుద్ధి దగ్గరకెళ్లి విషయమంతా వివరించి 'నీవు అనుమతిస్తే, మా అడవినుంచి వచ్చిన జంతువులన్నింటినీ తీసుకెళతాను. వాటిని చాలా ప్రేమగా, జాగ్రత్తగా చూసుకుంటాను' అని చెప్పింది.

దుష్ట బుద్ధిలోని మార్పును గమనించిన సుబుద్ధి జంతువులకు నచ్చచెప్పి పంపించింది. అప్పటినుంచి దుష్టబుద్ధి తన బుద్ధిని మార్చుకుని జంతువులన్నిటితో కలిసిపోయి, హాయిగా జీవించింది.



క్విజ్-78

1. జీవ పరిణామ సిద్ధాంతకర్త?
   ఎ. డార్విన్ బి. డాంటే
2. మొక్కల పెరుగుదలను కొలిచేది?
   ఎ.క్రెస్కోగ్రాఫ్ బి. లాక్టోమీటరు
3. అత్యంత వేగంగా పోగల జంతువు?
   ఎ.ఏనుగు బి. చిరుతపులి
4. 'బాదుషానామా' రచయిత ఎవరు?
   ఎ. తాన్‌సేన్ బి. తోడర్‌మల్
5. రాజమండ్రి ఏ నది ఒడ్డున వుంది?
   ఎ. గంగ బి. గోదావరి
6. అజంతా చిత్రములు వీరి కాలంలోనివి?
   ఎ.గుప్తులు బి.కుషానులు
7. రక్తము ఎర్రగా వుండుటకు కారణము?
   ఎ.హిమోగ్లోబిన్ బి.తెల్లకణాలు
8. వస్తువు కదలికకు ఆటంకం కలిగించేది?
   ఎ.బరువు
   బి.ఘర్షణ
9. ద్రవ పదార్థము?
   ఎ. పెట్రోలు
   బి. నీటి ఆవిరి
10. ఈ ఫొటోలోని చారిత్రక కట్టడం పేరేమిటి?
   ఎ. చార్మినార్
   బి. తాజ్‌మహల్



చుక్కలు కలిపి చూడండి

చిన్నారి చిత్రకారులు



వి. శ్రీనివాస్,
6వ తరగతి,
నవభారతి హైస్కూల్,
చొప్పదండి, కరీంనగర్.

ఎస్.సంపత్ కుమార్, 8వ తరగతి,
ప్రగతి బాలవిద్యాలయం,
సుందరయ్యనగర్, గుంటూరు.



ఎం.హర్ష, 3వతరగతి,
వర్డ్ అండ్ డీడ్ స్కూల్,
వనస్థలిపురం,
హైదరాబాదు.

యండి. రైస్ అహ్మద్,
6వ తరగతి,
నవభారతి స్కూల్,
చొప్పదండి,
కరీంనగర్.

ఊపిరితిత్తులు!



మ్యాజిక్ మ్యాజిక్!

హాయ్! మనకు ఎన్ని ఊపిరితిత్తులు వుంటాయో తెలుసా? ఆ... సరిగ్గానే చెప్పారు. రెండు వుంటాయి. మరి అవి ఎలా పనిచేస్తాయో తెలుసా? తెలీదా? అయితే ఇవాళ చెప్పుకుందాం. ఊపిరితిత్తులను తయారు చేయడానికి కొన్ని వస్తువులు కావాలి. అవేంటంటే... అడుగు తీసిన పెద్ద గాజు సీసా, ఒంటి రంధ్రపు రబ్బరు బిరడా, 'Y' గొట్టం, రెండు రబ్బరు బూరలు, రబ్బరు గుడ్డ, మైనం.

తయారుచేసే విధానం: ముందుగా అడుగు తీసిన పెద్ద గాజు సీసాను తీసుకోండి. దీనికి ఒంటి రంధ్రపు రబ్బరు బిరడాను బిగించాలి. ఈ బిరడాలో 'Y' గొట్టం అమర్చాలి. ఈ 'Y' గొట్టం రెండు చివర్లకు రెండు రబ్బరు బూరల మూతులు తగిలించాలి. రబ్బరు గుడ్డ మధ్య భాగంలో చిన్న రంధ్రం చేసి దానిగుండా లోనికి పోనిచ్చి లోపలికి ముడి వేయాలి. వెలుపలి వైపుకు దారం రెండవ కొ తీసుకొచ్చి రంధ్రాన్ని మైనంతో మూసివేయాలి. ఈ రబ్బరు గుడ్డను సీసా అడుగు భా కప్పి రబ్బరు తాడుతో సీసా అంచులకు కట్టాలి. సీసాకుగల ఈ రబ్బరు తాడ డయాఫ్రంలా పనిచేస్తుంది. ఇప్పుడు రంధ్రంగుండా బయటకు వదిలిన దారాన్ని డయాఫ్రం కిందికి వస్తుంది. దాని వలన బూరలలోకి గాలి వచ్చి అవి ఉబ్బు (గాలి పీల్చినప్పుడు మన ఊపిరితిత్తులు పెద్దగా అవుతాయి). దారం వదిలితే డయ లోనికి వెళుతుంది. బూరలలోని గాలి బయటకు పోయి చిన్నగా అవుతాయి (గాలి వదిలినప్పుడు ఊపిరితిత్తులు ముడుచుకుంటాయి). మనిషి ఊపిరితిత్తులు ప విధానానికి ఇదొక నమూనా.

క్విజ్ 77కు జవాబులు

1. ఇండియన్ నెపోలియన్ 2. 5 సంవత్సరాలు 3. గాంధీ జయంతి 4. ఇందిరాగాంధి 5. గాంగ్‌టక్ 6. టిబెట్ 7. రోగనిరోధక శక్తి 8. ఆక్సిజన్ 9. పరమాణువు 10. షేరూ

క్విజ్ 76కు సరైన సమాధానాలు రాసిన వారు :

జి.గాయత్రి, 10వ తరగతి, **యు.యు.బాబూనరేంద్రప్రసాద్,** 6వ తరగతి, శ్రీ వేణు విద్యాలయం, ఎమ్మిగనూరు. **కాలువ శ్రీఅనూష్య,** 5వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. **కె.రాజేష్,** 5వ తరగతి, పాత గాజువాక, విశాఖ. **ఎన్.వినూత్న,** 7వ తరగతి, మాధవదార, విశాఖపట్నం.

కలం స్నేహం

పేరు: ఎం.హరిణి,
వయసు : 6 సం॥
చదువు : 1వతరగతి
హాబీలు : క్యారమ్స్ ఆడడం, కార్టూన్ చానల్ చూడడం, డ్రాయింగ్ వేయడం.
పూర్తి చిరునామా : ఎం.హరిణి, డాటరాఫ్ ఎం.గణేష్, పి.నెం.51, బిడిఎల్ కాలనీ, వనస్థలిపురం, హైదరాబాదు-72.

పేరు: జె.యం.డి. ఉమర్,
వయసు : 14 సం॥
చదువు : 9వ తరగతి
హాబీలు : క్రికెట్, క్యారమ్స్ ఆడడం, కథలు చదవడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా : జె.యం.డి. ఉమర్, 9వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్.స్కూల్, చిన్నపొర్ల.

ఏక్ బూఢా - ఏక్ లడకా

అక్బర్-బీర్బల్ కథలు

ఆ రోజు అక్బర్ చక్రవర్తి సభలో వున్నారు. సరిగ్గా ఆయనకు ఆ క్షణంలో ఓ అనుమానం వచ్చింది. దాన్నే సభాసదులను అడిగారు. అదేంటంటే...'ఏక్ బూఢా, ఏక్ లడకా మహావీర్ హై. ఓ కౌన్ హై?'. ఆ ప్రశ్నకు సమాధానం తెలియక అంతా ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. పాదుషావారు బీర్బల్‌వైపు చూశారు. 'కనీసం నీవైనా చెప్తావా?' అన్నట్టు. కిందటి రాత్రి చక్రవర్తి మహాభారతాన్ని చదివిన విషయం బీర్బల్‌కు గుర్తొచ్చింది. వెంటనే సమాధానం ఏంటోకూడా స్ఫురించింది. వెంటనే లేచి నవ్వుతూ 'ప్రభూ! మహాభారతంలో కౌరవ పాండవ యుద్ధం జరిగింది. వ్యాసమునీంద్రుడు అందులో కురుపితామహుడగు భీష్ముని ఒక మహావీరునిగా వర్ణించాడు. అందువలన 'ఏక్ బూఢా' అంటే భీష్ముడు. 'ఏక్ లడకా' అంటే ఒక పిల్లవాడు. అతడు వీరాధివీరుడగు అర్జునుడి కుమారుడు అభిమన్యుడు. అతను ఒక పూట యుద్ధంలోనే వేలాది శత్రుసేనలను చూర్ణం చేశాడు. భీష్మ, అభిమన్యులే మహాభారత యుద్ధ రంగమునందలి మహావీరులు' అని సమాధానం చెప్పాడు. పాదుషావారు బీర్బల్ బుద్ధికుశలతకు, అతని చమత్కారానికి ఆనందించి సత్కరించారు.

చేపలను తినే చిలుక

చిలుకలంటే పచ్చగా, వంపు తిరిగిన ముక్కుతో వుంటాయని మనకు తెలుసు. కానీ కెనడా, అలస్కా ప్రాంతాలలో వుండే సముద్రపక్షులనుకూడా చిలుకలంటారు. కాకపోతే ఇవి పచ్చగా వుండవు. నలుపు తెలుపు ఈకలతో వుండే ఈ 'పఫిన్లు' ఎరుపు, పసుపు రంగులతో వంపు తిరిగిన ముక్కు కలిగి వుంటాయి.

వాటి గూళ్లు బొరియల్లా వుంటాయి. అవి కొండ అంచులపై నివశిస్తాయి. నేల లోపల రెండు మీటర్ల లోతులో గుడ్లు పెడతాయి. ఈ సముద్ర చిలుకలు చేపల్ని భోంచేస్తాయి.



* రుక్మిణి

పెన్షను పథకం - జోడిపి గొర్రెలు

గుర్నాధానికి ఆ మధ్యాహ్నం లంచవర్లో పట్టపగ్గాల్లేవు - తనలో తానే నవ్వుకుంటున్నాడు. సన్నని ఈలపాటోటి - మనిషి మాంచి హుషారులో వున్నాడు. తోట ఉద్యోగి నారాయణకంతా అయోమయంగా వుంది. గుర్నాధం హుషారుగా బయటకు నడిచాడు. నారాయణ 'విషయం కనుక్కోవచ్చని' వెంటబడ్డాడు.

"ఒరే నారాయణా... పద... పద... మనకు మహారాజయోగం పట్టబోతుందొరే... ఇక మన భవిష్యత్తంతా బంగారు బాటలో వెండిరథం మీద ఉరుకులే... నదువ్!" ఇద్దరూ హోటల్లో జొరబడి ఓ మూలన కూచొని టిఫిన్ ఆర్డరు చేశాడు. నారాయణకంతా ఇంకా అయోమయంగా వుండి" ఈ మహారాజెవడు... ఇంతలోనే వాడికి మనతో పనేంటీ? యోగం అంటాడు... కొంపదీసి ఆసనాలా ఏంటి కర్మ... టైముగాని టైము... వీడితో ఇదే చిక్కు...!' అవే విషయాల్ని నారాయణ పొడిపొడిగా అనడంతో గుర్నాధం ఇంతెత్తున ఎగిరి పడ్డాడు.

"ఒరే నారాయణా... నీకు బుర్రలేదు... వున్నా అది పని చేయదు... సరే... జర నేను చెప్పేది జాగ్రత్తగా విను! బలే... ఈ సృష్టిలో అతి వేగంగా పిల్లల్ని కనిపారేసే జంతువు ఏది?" నారాయణకు మూర్ఛ వచ్చినంత పనయ్యింది - గుర్నాధం విసుక్కున్నాడు.

"అబ్బ... వినరా... కుందేలు... కుందేలు.. మనం ఒక జతగానీ... నువ్గానీ పెంచి పారేస్తే మూడునెల్లకే అని ముప్పైదాకా దేకుతాయి - అబ్బో... ఆ లెక్కన ఒక సంవత్సరానికి ఒక వెయ్యేసుకో! అన్నట్లొరే నారాయణా... కుందేలు మాంసం మహారుచి! ఎంత లేదన్నా ఒక కుందేలుకు అయిదారు కిలోలు... ఎంత లేదన్నా కిలో వంద రూపాయలు గిడుతుంది.. చాలెంజ్! ఇక లెక్కేస్కో..." గుర్నాధం గాండ్రించి బల్ల లపలప చరిచి, టిఫిన్ రావడంతో దానిమీద పడ్డాడు.." ఈ కుందేలు... దాని మాంసం... పీకులాట... కిలో లెక్కలు..." అర్థంగాక నారాయణ జుట్టుపీక్కున్నాడు.

"ఒరే... కలపలో ఏ కలప శ్రేష్టం! టేకు! ఘనపుటడుగు వెయ్యి దాకా పలుకుతుంది. ఒక టేకు మొక్కను మనం గాని పెంచితే.. ఒరే దాని వార్షిక వలయం మందం పది సెంటీ మీటర్లేసుకో.. అంటే పదేళ్ళకు మీటరు... ఒకేసారిగా పదేళ్ళకు ఎత్తు పాతిక మీటర్లు... ఛలో లెక్కలు గిలుకు! ఘనపుటడుగు... వాటి మందం... వాటి తీరు...

కాఫీ తాగి బిల్లు గట్టి బయటకు వస్తున్నపుడు నారాయణకు 'ఇంత పొద్దున్నే ఈ గుర్నాధం గాడికి మెదడెట్లా చెడిపోయిందీ' అన్న అనుమానం కూడా వచ్చి వాడి బుర్రకేసి మిర్రిమిర్రి చూశాడు.

పార్కులో కూచున్నా గుర్నాధం వదల్లేదు.

"ఒరే ఉన్ని! అదేరా గొర్రెబొచ్చు... కిలో

ఎంత మాత్రం వుంటుందంటావ్?" నారాయణ ఝుడుసుకుని, హడలిపోయి నోరుబార్లా తెరిచాడు.

"పిచ్చోడా! గొర్రెల్లో జోడిపి గొర్రెలు చాలా శ్రేష్టం... రెండు వందలు పారేసి ఒక గొర్రె పిల్లను గానీ కొనిపారేస్తే సంవత్సరంలో దాని బొచ్చుకు రెండు వేలు... మాంసానికో వేయి వేసుకో.. అబ్బో... (గుర్నాధం సన్నగా కూనిరాగం ఓటి తీశాడు) అద్సరేగానీ ఒరే నారాయణా... జాగ్రత్తగా వినరా... 'ఎమూ' కోళ్ళను నువ్వెరగవు... అబ్బో... వాటిని నేను ఈ రెండు కళ్ళతో చూశాను.. నాలుగు గానీ కొనిపారేస్తే లక్షలు... లక్షలు... ఒకోదానికి టన్ను మాంసం... టన్ను... ఒరే దాని చర్మంతో బెల్టులు... పర్సులు... వాటికి విదేశాల్లో యమాగిరాకీ...

నారాయణకు ఒళ్ళంతా గిరాగిరా తిరిగిపోయింది. ఈ గుర్నాధం గాడికి కచ్చితంగా మతి చలించి వుంటుంది.. గానీ... దానిక్కారం ఎంత గింజుకున్నా అర్థమై చావడం లేదాయె! లేదా.. ఏ దెయ్యమో పట్టంటుంది! అట్లా దిగాలు పడుతున్నంతలో గుర్నాధం బొళబొళ నవ్వి అసలు విషయంలోకి వచ్చాడు.

"ఒరి నారాయణా... మొన్న మన కేంద్ర సర్కారు ఆగస్టులో కొత్త పెన్షను పథకాన్ని తయారు చేసింది. మన ముఖ్యమంత్రి చెంద్రబాబుగారు మనకోసం ఆవురావురుమని దాన్ని అమలు చేసి పారేయడానికి అగ్గగ్గలాడిపోతున్నాడు - ఉత్తరం కూడా రాశాడు. దాని ప్రకారం అక్టోబర్ ఒకటి 2002 నుండి అప్పాయింటయిన మన్లాంటి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సోదర సోదరీమణులందరికీ అది వర్తించి తీరుతుందన్నమాట...

నారాయణ చెవులు దొప్పల్లా విస్తరించి సీరియస్సుగా వింటున్నాడు -

"వింటున్నావా... దాని ప్రకారం ప్రతి నెలా మన జీతం... డి.ఎ.ల నుండి పది శాతం కోత బెట్టి... ఒరే... గవర్నమెంటు కూడా పది శాతం కలిపి మనకు పెన్షను కోసం దాన్లో నుండి అరవై శాతం దాకా ఈ రకంగా పెట్టుబడులు పెట్టుందన్నమాట! అంటే నెల నెలా మన డబ్బు వీటిల్లో పిల్లలు పెడుతుంది! ఇటు మ్యూచువల్ ఫండ్సలో... ఫైనాన్స్ కంపెనీల్లో... లాభసాటి వ్యాపారాల్లో షేర్లు అవీ లాగించేసి ఆ లాభాల్ని ఎవడికి వాడికి పెన్షను రూపంలో మనం రిటైరవంగానే.. అబ్బో... ఈ బోడిపెన్షనెవడిక్కావాలి... లాభాలుచాలు.. లక్షలు...!"

నారాయణ నిరుత్తరుడై వింటున్నాడు. వింటున్న కొద్దీ వెన్నులో వణుకులాంటిది మొదలయింది. మొహం నిండా చిరుచెమట్లు పట్టాయి - గుర్నాధం మాత్రం రెచ్చిపోయి వాయించేస్తున్నాడు.

"ఒరే గుర్నాధం... కాస్త బ్రేకేస్తావా... ఆగు!" ఒక్కసారే నారాయణ గద్దింపుతో గుర్నాధం దద్దరిల్లి లొడలొడ వాగడం ఆపుచేశాడు!

"ఒరే గుర్నాధం... అదిరా సంగతి.. మరి చెప్పవేం... వినుమరి.. నేను చెప్తా! ముందుగా మన బాబుగారు మన జీతంలో పదిశాతం లటుక్కున కోతకు తగులుకుంటాడు - అటు తర్వాత మన రాష్ట్ర ఖజానా ఖాళీ 'బొక్కసం' చూపించి పది శాతం కలపలేమని చేతులెత్తేస్తాడు. ఒరే... అటు ప్రపంచ బ్యాంకు వడ్డీ తడిసి మోపెడై వడ్డీలు కట్టలేక విలవిల్లాడిపోతున్నాను... అంటాడు! సరే.. ఈ స్కీములు చెప్పావు చూడు - అన్నీ బోగస్... దివాళా మేళం! కో ఆపరేటివ్ బ్యాంకుల దివాళా - మూసివేత - పరారీలు చూడడం లేదూ... ప్చ్... ఇంకా నయం... గుర్రప్పందాలో... పేకాటలోనో పెడతాననలేదు - నయం!"

"అహ... వాటివల్లా...!" గుర్నాధం నీళ్ళు నములుతూ గొణగబోయాడు - "షటప్! ఈ కోతేసిన గబ్బుకు పాతికేండ్ల తర్వాత జవాబుదారీ ఎవడూ వుండడు! గ్రాట్యుటీలో కోతపెడతాడు... ఎలాగూ డి.ఎ.కు మంగళం పాడాడు!"

గుర్నాధం ఈ దెబ్బకు నీరసించి పోయాడు. మొహం పాలిపోయింది.

"ఒరే గుర్నాధం... మన డబ్బుల్తో కుందేళ్ళూ... గొర్రెలూ కొనడం... వాటి మాంసం... హవ్వ... గొర్రెల్లా ఆలోచించకుండా దీన్ని నిలవరించాలి... లేకపోతే టేకుచెట్లు కాదు... మన బతుకు ముళ్ళ దొంకల్లో దూరి కాపరాలు పెట్టాల్సి వస్తుంది...

ఈ పాటికే గుర్నాధం వెనక్కి విరుచుకుపడి ఆలోచనల్లోకి జారుకున్నాడు. ●

కష్టమొకరిది...

భూమీ్మద అందమైన నిర్మాణాల్లో తాజ్‌మహల్ ఒకటి!

నిజమే!

తాజ్‌మహల్ కట్టడం వెనక అందమైన కథ వుంది. అద్భుతమైన చరిత్ర వుంది. తన భార్య కోసం ఒక భర్త ఆరాధనా పూర్వకంగా నిర్మించిన మనోహరమైన కట్టడమది! ఒప్పుకున్నాం. తద్వారా ఆ భర్తకు తన భార్య పట్ల గల ప్రేమానురాగాలు ప్రపంచానికి బాగా తెలిసేయంటున్నారు! అవునవునంటున్నాం. ప్రేమ అనే పవిత్రమైన గ్రంథానికి ఆ భర్తా ఆ భార్య ముందుమాటలుగా నిలిచిపోతారంటున్నారు! అంతకంటేనా అంటున్నాం. వాళ్ళ కథ సువర్ణాక్షరాలతో రాయవలసిన అవసరం ఎంతైనా వుందంటున్నారు! అంతేగా మరి అంటున్నాం. వదిలేయండి. ఇప్పుడు నేను తమకి మనవి చేయదలుచుకున్నది - తాజ్‌మహలూ... దాని నిర్మాణ భాగోతం గురించి కానేకాదు. అంత అందమైన తాజ్‌మహల్‌కి రాళ్లెత్తిన కూలీలెవరని మహాకవి మానవజాతిని అడుగుతున్నాడు.

తల తిరిగిపోయే ప్రశ్న!

సమాధానం దొరకని ప్రశ్న!

బోలెడు ఫిలాసఫీ దాక్కున్న ప్రశ్న!

ఈ ప్రశ్నకి బదులేది అని అడుగుతున్నాను! ఆ కూలీల లిస్టు ఏ చరిత్రకారుడు భద్రపరిచేడు? ఎవర్నడిగితే తెలుస్తుంది? ఈ ప్రశ్నలు అలా వుండిపోతే బావుండిపోను. ఈలోగా ఒక చమత్కారి మహాకవికి వళ్ళు మండిపోయే ప్రశ్న విసిరేడు. తమరు రాసిన మహాప్రస్థానం కావ్యానికి అక్షరాలు కంపోజ్ చేసిన ప్రెస్సు కార్మికుడెవరని ఎంతో వినయంగా అడిగేడు. వీరెవరో తమరు చెబితే వారెవరో తమకు నేను చెబుతానని వినయంగానే మనవి చేసేట్ట! అంచేత ఏమిటంటే - మహాకవి ప్రశ్నకి జవాబు దొరకడం ఎంతకష్టమో... చమత్కారికి సమాధానం చెప్పడం కూడా అంతే కష్టం!

ఏతావాతా భూలోకంలో తాజ్‌మహల్ నిర్మాణం జరిగినందుకు ఎంత సంతోషిస్తున్నామో - సాహితీలోకంలో మహాప్రస్థానం వెలుగుతున్నందుకు అంతే సంతోషించాలి. ఫ్లాష్‌బేకులూ పూర్వాపరాలు అడక్కూడదు. అమావాస్య హోటల్లో పెసరట్టు అద్భుతంగా వుండచ్చు. ఆ కీర్తి మొత్తం అమావాస్య హోటల్‌కే దక్కుతుంది గానీ ప్రత్యేకించి పప్పు రుబ్బే పాపారావు గురించి గానీ, పెనమీ్మద పెసరట్టు పోసే పోతురాజు గురించి గానీ ఎవరూ అడగరు. అది రూలు! మంత్రిగారు వస్తున్నారంటే నీచమైన రోడ్లన్నీ నీటుగా తయారవుతాయి. మురికి వీధులన్నీ ముచ్చటగా అలంకరింపబడతాయి. ఆ దెబ్బతో ఆ ఊరి మునిసిపల్ కమీషనరుకు పెద్ద పేరొస్తుంది! అతనికంత పేరు రావడానికి కారణమేమిటి? స్వయంగా అతనొక్కడే బుట్టాతట్టా నెత్తినెట్టుకుని రేయింబవళ్ళు చెత్తాచెదారం ఎత్తిపారేసేడనా అర్థం? ఏ మాత్రం కాదు!

ఆ చెత్త పనికి ఎవరెవర్నో నియమించి - కీర్తి ప్రతిష్టలు మాత్రం తాను తన్నుకుపోతాడని మనందరికీ తెలుసు! ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఢిల్లీ పెద్దలు తనఖీ చేస్తున్నారని తెలీగానే - గుమాస్తాలూ బంట్రోతులూ యావన్మందీ అధికంగా శ్రమించి అన్ని రికార్డులూ అద్దంలా సిద్ధం చేస్తారు. ఢిల్లీ పెద్దల మెచ్చుకోళ్ళు మాత్రం కేవలం ఆఫీసు అధికారికి మాత్రమే దక్కుతాయి! మీ మెచ్చుకోళ్ళు నాకు వద్దు - నా కింది సిబ్బందికీ బంట్రోతులకు రాసివ్వమని ఏ అధికారీ చెప్పడు. అర్జీ పెట్టడు. ఆ ప్రయత్నం జరిగితే సదరు అధికారికి బందరు పిచ్చోడని బిరుదిస్తారు! శ్రమ ఒకరిదీ కీర్తి మరొకరికీ అనే సూత్రం సూర్యచంద్రులున్నంత వరకు చెలామణీ అవుతూనే వుంటుంది. ఇంతలో ఈ ధర్మ సూత్రానికి తెరపడే సూచనలు బొత్తిగా లేవు!

బిర్లాగారబ్బాయి మనింటికి భోజనానికి వస్తున్నాడని సుబ్బారావు తనింట్లో చెప్పుకోవచ్చు. వంటమాత్రం అతను చేయడు. అతని భార్య సుబ్బలక్ష్మి మాత్రమే చేయాలి. బిర్లాగారబ్బాయికి ఏ వంట ఎట్లా వుంటే లొట్టలేసుకుంటూ తింటాడో తెలుసుకోవాలి. భోజనం పూర్తయ్యేక అతనికి తాంబూలం సేవించే అలవాటుందో లేదో కనుక్కోవాలి. తాంబూలం తప్పనిసరని తెలుస్తే అందులో అవసరమయ్యే దినుసులు కూడా అతన్ని అడగకుండా తెలుసుకోవాలి. ఇంటిని పరిశుభ్రంగా వుంచాలి. అదనపు అలంకారాల నిమిత్తం పక్కింటి పిన్నిగారిని అడిగి సోఫాసెట్టు తెప్పించుకోవాలి. ఫేనూ వగైరాల కోసం ఎదురింటి వదిన గారిని రిక్వెస్టు చేయాలి. టేపు రికార్డరు సంపాయించాలి. సైగల టేపులు సేకరించి అందులో అమర్చాలి. గంధం పుల్లలు వెలిగించాలి. ఇల్లంతా సుగంధ పరిమళాలతో నింపాలి!

ఆనక బిర్లాగారబ్బాయి వస్తాడు. విందారగిస్తాడు. తాంబూలం నముల్తాడు. చల్లని వాతావరణంలో నట్టింట కొంత సేపు విశ్రమిస్తాడు. గంధం తాలూకు గాలులు పీలుస్తూ గాల్లో తేలిపోతుంటాడు. అమర గాయకుడు సైగల్ టేపులు మనసు పులకరిస్తుండగా వింటాడు. ఇంత జరిగేక నీ టేస్టు అమోఘమని సుబ్బారావుకి మాత్రమే సర్టిఫికెటిస్తాడు. ఆనక హెడ్ ఆఫీసుకి వెళ్ళి సుబ్బారావుకు ప్రమోషనిచ్చి అతని స్థాయిని పెంచుతాడు. ఇంత మహత్తరమైన కార్యక్రమానికి వెన్నముకగా నిలిచిన సుబ్బలక్ష్మి స్థితిగతులు మాత్రం యథాప్రకారంగానే వుంటాయి. సుబ్బలక్ష్మి నీ మూలంగా నాకు మేలు జరిగిందని కట్టుకున్న వాడూ అనడు. అమ్మా నువ్వు నిజంగా అన్నపూర్ణమ్మవని బిర్లాగారబ్బాయీ బిరుదివ్వడు. ఒక చిన్న ఇంటి భాగోతానికే సరైన సమాధానం దొరకని ఈ రోజుల్లో తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవరో - మహాప్రస్థానానికి అక్షరాలెవరు సమకూర్చి పెట్టారో చెప్పండని అడిగితే ఏం చెబుతాం? మహా చెప్పగలిగితే మేము కాదని నిజం చెబుతాం! అంతేగా? ●

కేసరిగిరి క్షేత్రమే కీసరగుట్ట



త్రిలింగ దేశంగా పేరొందిన ఆంధ్రప్రదేశ్‌లోని ప్రఖ్యాత శైవక్షేత్రాలలో రాజధాని హైదరాబాద్‌కు 33 కి.మీ. దూరంలో ఉన్న కీసరగుట్ట ఒకటి. చారిత్రకంగా కూడా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రం అతి పురాతనమైనదిగా స్థానిక ప్రజలు పరంపరానుసారంగా విశ్వసిస్తున్నారు. త్రేతాయుగంలో శ్రీరాముడు ఈ లింగాన్ని ప్రతిష్టించినట్లు చెప్పబడుతున్నందున ఈ స్వామికి శ్రీరామలింగేశ్వరస్వామి అని పేరు వచ్చింది. చారిత్రక పరిశోధకుల అభిప్రాయాన్ననుసరించి క్రీ.శ. 4వ శతాబ్దం ఉత్తరార్థం నుండి క్రీ.శ. 7వ శతాబ్దం పూర్వార్థం వరకు ఆంధ్రదేశమును ఏకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలించిన విష్ణుకుండిన రాజవంశమునకు కీసరగుట్టతో సన్నిహిత సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది.

విష్ణు కుండినులు మొదట ఇంద్రపురిని (నేటి నల్గొండ జిల్లా రామన్నపేట మండలంలోని తుమ్మలగూడెం) రాజధానిగా చేసుకొని ప్రజారంజకంగా పరిపాలన చేశారు. కీసరగుట్ట ప్రాంతం వారి "సైనిక స్థావరం". ఈ ప్రాంతంలో పురావస్తు శాఖ వారి త్రవ్వకం, పరిశోధనలలో 3 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఒక శిథిలమైన కోట, భవనాలు, ఆభరణాలు, అలంకార వస్తువులు, నాణాలు, మట్టిపాత్రలు, యజ్ఞకుండములు వెలుగు చూసినవి. ఈ వంశంలోని మొదటి గోవిందవర్మ బలపరాక్రమం అనేక రాజ్యాలను జయించి బౌద్ధారామ విహారాలను, చైత్యాలను, దేవాలయాలను నిర్మించి ప్రసిద్ధి చెందినట్లుగా ఇంద్రపురి (ఇంద్రపాల నగరం) తామ్ర శాసనం ద్వారా తెలుస్తోంది.

ఈ వంశీయులు అపురూపమైన దేవాలయాలను, గుహాలయాలను నిర్మించారు. నల్గొండ జిల్లాలోని చెరువు గట్టు "జడలరామ లింగేశ్వర ఆలయం", తుమ్మలగూడెం (ఇంద్రపురి)లోని 'రామేశ్వరాలయం', 'అమరేశ్వరాలయం', 'మల్లికార్జున ఆలయం'. మహబూబ్‌నగర్‌జిల్లా షాద్‌నగర్ సమీపాన 'ఉత్తర రాజరామలింగేశ్వరాలయం', కందూరు 'రామలింగేశ్వరాలయం', గుంటూరు జిల్లా వేల్పూరు 'రామలింగేశ్వరాలయం' వీటిలో కొన్ని మాత్రమే.

ఈ విష్ణుకుండినులు విద్యావ్యాప్తికి విశేష శ్రద్ధ తీసుకొని అనేక 'ఘటికాస్థానం'లను నెలకొల్పారు. ఘటికాస్థానములనగా ఈనాటి విశ్వవిద్యాలయాల వంటివి. వీటిలో చతుర్వేదం, షడంగములు, తర్క మీమాంస, వ్యాకరణాది షట్ శాస్త్రాలు, ఆయుర్వేదం మొదలైన ఉపవేదాలను బోధించేవారు. కీసరగుట్ట పక్కనే ఉన్న ఘట్‌కేసర్ ఒకప్పటి ఘటికాస్థానమే. ఈ రాజవంశీయులకు ఆరాధ్యదైవమైన కేసరిగిరి శ్రీరామలింగేశ్వర స్వామి క్షేత్రం వారి పరిపాలనా కాలంలో నిత్యోత్సవాలు, మాసోత్సవాలు, బ్రహ్మోత్సవాలతో మహోన్నత స్థితి పొందింది.

క్రీ.శ. 17వ శతాబ్దంలో గోల్కొండ కుతుబ్‌షాహీ వంశంలోని అబ్దుల్ హసన్ తానాషా నవాబు వద్ద మహామంత్రులుగా ఉన్న అక్కన్న మాదన్నలు కేసరిగిరి శ్రీరామలింగేశ్వరస్వామిని దర్శించి ఈ క్షేత్రమును 'హరిహర క్షేత్రము'గా అభివృద్ధి చేయదలచి హిందూ, మహమ్మదీయ సమ్మిళిత సంప్రదాయం ఉట్టిపడేలా ఒక దేవాలయాన్ని నిర్మించారు. దానిలో శ్రీలక్ష్మి నృశింహ స్వామి విగ్రహాన్ని ఉంచారు. వారు ఈ క్షేత్రానికి కొన్ని స్వాగత ద్వారాలు (కమాన్) కూడా నిర్మించారు.

అక్కన్న, మాదన్నలు నిర్మించిన దేవాలయానికి వెనుక ఒక ఏకశిలా విజయస్థూపం కలదు. ఈ స్తంభమునకు మత్స్య, కూర్మ, వరాహ, గణపతి, ఆంజనేయ విగ్రహాలు చెక్కబడి ఉన్నాయి. దేవాలయానికి ముందు భాగాన ఉన్నటువంటి హనుమంతుడు కాశీక్షేత్రము నుండి తెచ్చిన శివలింగాలు, శ్రీఆంజనేయ స్వామి వారి దేవాలయం, సీతమ్మ గుహ (సీతాదేవి పూజించిన మహిషాసురమర్దిని ఆలయము), రెండు కొండల మధ్యన ఉన్న తెల్లతామరకొలను, మునుల గుహలు, మూడుబావులు, పాలకుండంవంటి ప్రదేశాలు చూడదగినవి. ఈ మధ్యనే పురావస్తు శాఖ వారు ప్రదర్శశాల (మ్యూజియం)ను ఏర్పాటు చేశారు. దీనిలో విష్ణుకుండినుల కాలం నాటి వస్తువులు ఉన్నాయి. ●

✻ సుమెరా ఫిర్దోస్

హోం జిమ్ పరికరాలు

✻ ఫోల్డబుల్ మ్యాగ్నెటిక్ ట్రేడ్‌మిల్
✻ డంబెల్స్
✻ రెసిస్టెన్స్ బాండ్స్
✻ అబ్ స్లయిడ్
✻ అబ్ షేపర్
✻ అబ్ బాల్స్
✻ లెగ్, హ్యాండ్ వెయిట్స్
✻ బెంచ్ స్టెప్పర్
✻ ఎయిర్ వాకర్
✻ అబ్‌స్టమి ట్రిమ్మర్
✻ లైట్ వెయిట్ మ్యాగ్నెటిక్ బైక్‌లు
✻ ఫిట్‌నెస్ బాల్స్



ఇంట్లో జిమ్‌కి 'ఈజీ' పరికరాలు

ఆధునిక సమాజంలో శారీరక దారుఢ్యం, ఆరోగ్యకర శరీరం, ఫిట్‌నెస్‌లకు ఎక్కువ ప్రాధాన్యత ఉంది. ఎక్కడికి వెళ్లినా తెలివితేటలతో పాటు శారీరకంగా కూడా ఫిట్‌నెస్‌ను కూడా పరిశీలిస్తున్నారు. ఒక వ్యక్తి ఎంత తెలివైనవాడు అయినప్పటికీ ఆరోగ్యంగా లేకపోతే అతన్ని ఎవరూ ఆదరించరు. ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగం సంపాదించాలన్నా, నలుగురిలో గుర్తింపు పొందాలన్నా తెలివితేటలతో పాటు ఫిట్‌నెస్ కూడా అవసరం. ఉరుకులు పరుగుల జీవితంలో శారీరక ఫిట్‌నెస్‌ను పెంపొందించుకోవడానికి మన వద్ద సమయం చాలా తక్కువగా ఉంది. సమీపంలోని జిమ్‌కు వెళ్లేందుకు కూడా చాలా మందికి కొంత సమయం లభించడం లేదు. మరికొంతమందికి వ్యాయామం చేయాలని ఉన్నా జిమ్‌కు వెళ్లేందుకు బద్ధకించడంతో ఫిట్‌నెస్ సంపాదించలేక పోతున్నారు. ఇటువంటి వారి కోసం ఇప్పుడు లైట్ వెయిట్ ఫిట్‌నెస్ పరికరాలు మార్కెట్‌లోకి వచ్చాయి. వాటి ధరలు కూడా తక్కువగా ఉండి మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఇంట్లోనే శారీరక దారుఢ్యాన్ని, ఫిట్‌నెస్‌ను పెంపొందించుకోవడం కోసం నగరాల్లో చాలామంది ఎక్సర్‌సైజ్ బైక్‌లను, ఎలిప్టికల్ ట్రెయిన్‌లను, ట్రేడ్‌మిల్స్‌లను, క్రాస్ ట్రెయినర్స్‌ను కొంటున్నారు.

ఇంట్లో ఏకాంతంగా వ్యాయామం చేయాలనుకునే వారికి లైట్ వెయిట్ పరికరాలు బాగా ఉపయోగపడతాయి. వీటిని కొనడానికి డబ్బు కూడా ఎక్కువగా ఖర్చుకాదు. పైపెచ్చు ఇంట్లో ఎక్కువ ప్రదేశాన్ని కూడా ఇవి ఆక్రమించవు. "కుటుంబంలోని ముగ్గురు, నలుగురు సభ్యులు వాడడానికి లైట్ వెయిట్ ఫిట్‌నెస్ యంత్రాలు చాలా ప్రయోజనకారిగా ఉన్నాయి. హెవీ వెయిట్ పరికరాలకు 4 హెచ్‌పి మోటార్ అవసరమవగా, లైట్ వెయిట్ పరికరాలను ఉపయోగించడానికి 2 హెచ్‌పి మోటార్ సరిపోతుంది. హెవీ, లైట్ వెయిట్ పరికరాల నిర్మాణం, ఉద్దేశం ఒకటే అయినందున ఏది వాడినా ఫలితం ఒక్కటే" అని ఒక జిమ్ ఇన్‌స్ట్రక్టర్ సాదిఖ్ అలీ అంటున్నారు.

ఫిట్‌నెస్ ప్రధానోద్దేశ్యం కండరాలను, ఎముకలను గట్టిపర్చడం. ఫిట్‌నెస్ సాధించాలనుకునే ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం 20 నిమిషాల చొప్పున వారానికి కనీసం మూడు రోజులు చేయాలి. శరీరంలో పెరిగే కొవ్వును తగ్గించడానికి ఇండోర్ సైక్లింగ్, ట్రేడ్‌మిల్, ఎలిప్టికల్ ట్రెయినర్‌లతో వ్యాయామం చేయాలి. లైట్ వెయిట్ డంబుల్స్, వెయిట్ బెంచ్‌లతో శరీరాకృతిని అనుకున్న విధంగా మలచగలం. తక్కువ బడ్జెట్, ప్రదేశం కలవారికి రెసిస్టివ్ బాండ్స్ మరో వ్యాయామ పరికరం. 200-300 గ్రాముల బరువుగల రెసిస్టివ్ బాండ్స్‌తోనే కండరాలను పరిపుష్టిగా మార్చుకోవచ్చు. అబ్ స్లయిడ్, అబ్ బాల్స్ (300-400 గ్రాములు)లతో వీపు, భుజాలు, పొట్ట భాగాన్ని అనుకున్న షేప్‌లోకి మార్చుకోవచ్చు. లెగ్ వెయిట్‌లు, హ్యాండ్స్ వెయిట్‌లు అర కెజీ నుండి ఐదు కిలోల వరకు బరువు ఉంటాయి. పిరుదులు, తొడలు ఎత్తుగా ఉన్నవారు వీటిని ఉపయోగిస్తే లాభముంటుంది. లైట్ వెయిట్ మ్యాగ్నెటిక్ బైక్‌లు, ఎలిప్టికల్ సిస్టమ్‌లు హెవీ, లైట్ పద్ధతుల్లో దొరుకుతాయి. ఈ పరికరాలు తక్కువ బరువు కలిగి ఉండడంతో ప్రయాణాల్లో కూడా వెంట తీసుకెళ్లవచ్చు. దీంతో మనమెక్కడున్నా ఆటంకం లేకుండా వ్యాయామం చేసుకోవచ్చు. ఈ పరికరాల కొనుగోలుకు డబ్బును ఒక్కసారి ఖర్చుచేస్తే జీవితాంతం పనికొస్తుంది. మంచి ఫిగర్ కంటే ఆరోగ్యవంతంగా ఉండడం, శారీరక దారుఢ్యం కలిగి ఉండడం ముఖ్యమని ప్రముఖ డిజైనర్, సంఘసేవకురాలు వినీతా పిట్టీ అంటున్నారు.

ఈ లైట్ వెయిట్ పరికరాలు పురుషుల కంటే ఎక్కువగా మహిళలకు ఉపయోగపడతాయి. పురుషులు దగ్గరలోని జిమ్‌కు ఏదో ఒక సమయంలో వెళ్లగలుగుతారు. మధ్యతరగతి మహిళలు జిమ్‌కు వెళ్లడం కష్టం. తక్కువ బరువుగల పరికరాలను ఇంట్లోకి తెచ్చుకుంటే ఇంటిల్లిపాదీ వ్యాయామం చేస్తూ ఫిట్‌నెస్‌ను కాపాడుకునే అవకాశముంది. ●

> నేను జిమ్‌లో వ్యాయామం చేస్తున్నప్పుడు రోజూ వెళ్లలేకపోయేవాణ్ణి. దీంతో నా శరీర దారుఢ్యాన్ని అనుకున్న విధంగా మార్చుకోలేకపోయాను. ఇప్పుడు లైట్ వెయిట్ ఎక్విప్‌మెంట్‌ను ఇంటికి తెచ్చుకున్న తర్వాత నిరాటంకంగా వ్యాయామం చేస్తూ శరీరాన్ని అనుకున్న షేప్‌లోకి మార్చుకోగలుగుతున్నాను.
>
> – సిద్ధార్థ

✻ పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

జోరుగా వర్షం కురుస్తోంది.

నీరు రోడ్డు మీద ఏరులై పారుతోంది.

విశాఖపట్నం పెదవాల్తేరులో రేకుల షెడ్డు కింద సోఫేటి ఎల్లయ్య బిక్కుబిక్కుమంటూ నిల్చున్నాడు. ఓ మూల మూటగా కట్టిన సామాన్లు తడిచిపోయాయి. నులకమంచం తడుస్తూనే ఉంది. తనకు ఉపాధిని ఇచ్చే కుట్టు మిషను కూడా దాదాపు తడిచిపోయింది. దానిపైన కప్పిన పాతగోనె సంచి నీటిని పీల్చుకుని బరువెక్కిపోయింది.

'ఎప్పుడు వర్షం తగ్గుతుందా' అని ఎల్లయ్య ఎదురు చూస్తున్నాడు. అతని మనసులో గూడుకట్టుకున్న బెంగ, దిగులు వర్షంతో పాటు ఎక్కువ అవుతున్నాయి.



దర్జీ ఎల్లయ్య

శ్రీకాకుళం నుంచి ఉపాధి వెతుక్కుంటూ వచ్చి పడిన కష్టాలన్నీ కళ్ళముందు కదలాయి. కళ్ళల్లో నీళ్ళు ఉబికాయి. వర్షం మసగ్గా అనిపించింది. పక్కనున్న రుమాలు లాంటి గుడ్డ తీసుకుని కళ్ళు తుడుచుకున్నాడు.

వారం రోజులుగా నిలువ నీడ లేదు.

పెద జాలరిపేటలో టైలరింగు షాపు పెట్టుకుని బతుకును ఈడ్వాలనుకున్న అతని ఆశలన్నీ అడియాసలయ్యాయి. కట్టుబట్టలు, కుట్టుమిషను పట్టుకుని దర్జాగా బతుకుదామని వలస వచ్చిన ఎల్లయ్యను విశాఖనగరం అక్కున చేర్చుకుంది.

పెదజాలరిపేటలో చిన్న కొట్టులో కుట్టుమిషను పెట్టి పని ప్రారంభించాడు. చుట్టుపక్కల వారితో పరిచయాలు పెంచుకున్నాడు. కొత్త బట్టలు ఇస్తే అందంగా కుడతానని హామీ ఇచ్చాడు. అలాగే దర్జీ పని మొదలు పెట్టాడు.

ఆధునికత ఎల్లయ్యను దెబ్బతీసింది.

రెడీమేడ్ దుస్తులు మార్కెట్‌లో లభించడం, ఎక్కువ మంది వాటి పట్ల మొగ్గు చూపిస్తుండటంతో ఆదాయం తగ్గిపోయింది. పాత బట్టలకు సైజులు చేయడం, చిరుగులు కుట్టడం వంటి చిన్న చిన్న పనులు మాత్రం లభించేవి

నిరంతరం ఆశల ఆరాటంతో జీవన పోరాటం.

ఆ సమయంలో రోడ్డును విస్తరించే పనులు ప్రారంభమయ్యాయి. చిన్న షాపు కూలిపోయింది. ఎల్లయ్యకు నిలువనీడ లేకుండా అయిపోయింది.

మహానగరంలో ఒంటరివాడు అయిపోయాడు.

తెచ్చుకున్న సామాన్లు, కుట్టుమిషనుతో పెదవాల్తేరు చేరుకున్నాడు. ఓ మూల పాడుబడ్డ రేకుల షెడ్డు తాత్కాలిక ఆశ్రయాన్ని ఇచ్చింది.

ఏమి చేద్దామా అన్న ఆలోచన కార్యరూపం దాల్చక ముందే వర్షం మొదలైంది.

వర్షాన్ని చూస్తూ ఎల్లయ్య ఆలోచనల్లోకి జారిపోయాడు.

'రేపు' భయంకరంగా కనిపిస్తోంది.

'ఎలా బతకాలి... ఎక్కడ బతకాలి' అన్న వూహ భరించలేకుండా మదిలో సుళ్ళు తిరుగుతోంది.

తడిచిపోయిన కుట్టుమిషను... ఆ పక్కన అట్ట పెట్టెలో కత్తెర, దారపు ఉండలు.. గుడ్డ ముక్కలు దీనంగా చూస్తున్నట్లు అనిపించాయి. మరో పని చేతకాని తన జీవితం మీద ఎల్లయ్యకు నల్లని మేఘంలా నిరాశ కమ్ముకుంది.

ఆలోచనల్లోకి జారిపోయాడు.

* * *

ఒక్కొక్క విజయానికి ఒక్కొక్క సోపానం ఉంటుంది. ఎవరో కలిగించిన స్ఫూర్తి అభివృద్ధికి ఆస్కారం కలిగిస్తుంది.

వర్షంలో తడిచిన దర్జీ ఎల్లయ్యకు తోపుడు బండి బుగత అప్పారావు ఆదర్శం అయ్యాడు.

రాత్రి ఎనిమిది గంటలప్పుడు.

ఎల్లయ్య ఆకలితో నకనకలాడాడు. జేబులో ఆరు రూపాయలు తప్ప చిల్లర లేదు.

పకోడీలు, బజ్జీలు తోపుడు బండి మీద అమ్ముకుంటూ వస్తున్న అప్పారావును కలిసి తన పరిస్థితిని వివరించాడు. జేబులో ఉన్న ఆరు రూపాయలు అతని చేతిలో పెట్టాడు.

అప్పారావు బజ్జీలు, గారెలు, పకోడి పొట్లం కట్టి ఎల్లయ్య ఆకలి తీర్చాడు... "నా లాగే నువ్వూ ఓ తోపుడు బండి కొనుక్కో... వ్యాపారం చెయ్యి... రోజుకు పదో, ఇరవయ్యో మిగులుతుంది" అన్నాడు.

"నాకు టైలరింగు వచ్చు. కొత్త కొత్త ఫేషన్లతో బట్టలు కుట్టడం నేర్చుకున్నాను-"

ఈ కాలంలో టైలరింగుకు ఆదరణ లేదు... చదువుకున్న వారంతా ఇళ్ళల్లో మిషన్లు కొనుక్కుని చిన్న చిన్న కుట్లు, అల్లికలు తామే చేసుకుంటున్నారు. రెడీమేడ్ బట్టలు కొంటున్నారు. కుట్టించుకోవాలంటే అద్దాల గదులతో ఆకర్షించే టైలర్ల వద్దకు వెళుతున్నారు... నీ దగ్గరికి ఎవరు వస్తారు ?" వివరించాడు బుగత అప్పారావు.

"అయితే ఏం చేయాలి?"

"మధ్య తరగతి, కింది తరగతి ప్రజల బట్టలు కుట్టడానికి నువ్వు ఉపయోగపడాలి... నీ దగ్గరికి వారు వెతుక్కుని రాలేరు. నువ్వే వారిని వెతుక్కుని వెళ్ళాలి... ఉపాధిని వెతుక్కోవాలి..."

ఎల్లయ్య ఏమీ మాట్లాడలేదు...

"నేను చూడు వీధి వీధి తిరుగుతాను...

మనుషులున్న చోట బడ్డీ ఆపుతాను. స్టవ్ వెలిగించి వేడివేడి గారెలు చేస్తాను... అందుకే నేను రోజూ వచ్చే సమయం కోసం ఆ తోవలో నా కోసం కొంతమందైనా ఎదురు చూస్తుంటారు!"

"నీ తిండి నా కడుపు నింపింది.... నీ మాటలు ఉత్సాహాన్నిచ్చాయి... ఉదయం నుంచి కురిసిన వర్షం చూసి నిరాశలో పడిపోయాను... నువ్వు కలవడం నాకు ఎంతో బాగుంది-" ఎల్లయ్య చెప్పాడు. ఆ తర్వాత తోపుడుబండి గురించి వివిధ విషయాలు... వివరాలడిగి తెలుసుకున్నాడు.

రేకుల షెడ్డు తడిచిపోయినా... చల్లటి గాలి శరీరాన్ని చుట్టేస్తున్నా సోపేటి ఎల్లయ్యకు హాయిగా నిద్ర పట్టింది.

* * *

సోపేటి ఎల్లయ్య ఎప్పుడో కొనుక్కున్న వేలికి ఉన్న బంగారు ఉంగరాన్ని అమ్మి డబ్బులు జేబులో వేసుకున్నాడు... దర్జీ పనుల మదుపుల కోసం ఉంచుకున్నవి కూడా సిద్ధం చేశాడు.

పెద్ద సైజు తోపుడు బండిని తయారు చేయించాడు. తోసుకుని పోవడానికి వీలుగా రిక్షా టైర్లు వేయించాడు. అందులో కుట్టు మిషను పెట్టి చిన్న స్టూలు వేశాడు. చుట్టూ గౌనులు, లంగాలు... చీరలకు కుట్టే ఫాల్సు వేలాడదీశాడు. కొబ్బరికాయ కొట్టే పని ప్రారంభించాడు.

బండిని తోసుకుని వీధుల వెంట తిరగడం, కూడలిలో ఆపు చేయడం చేసేవాడు. ఎవరైనా బట్టలు కుట్టడానికి ఇస్తే సైజులు తీసుకొనేవాడు. అతుకులు కుట్టడం, సైజులు చేయడం అక్కడికక్కడే పూర్తి చేసేవాడు.

మొదటివారం కాస్త అలవాటు పడింది.

పెదజాలరిపేట, లాసన్స్‌బేకాలని, వుడా పార్కు, క్వార్టర్లు, చినవాల్తేరు తదితర ప్రాంతాల్లో కదిలే టైలరింగు షాపుకు చాలా మంది వస్తున్నారు. బట్టలు కుట్టించుకుంటున్నారు.

రోజూ క్రమం తప్పకుండా తోపుడు బండిని తోసుకురావడం, బట్టలు కుట్టడం నిత్యకృత్యం అయిపోయింది. మురికివాడల్లో ఉంటున్న నిరుపేదల కోసం పాత బట్టలు సైజులు చేసి అమ్మకం కూడా మొదలు పెట్టాడు.

ఎల్లయ్య వృత్తిలో పుంజుకున్నాడు.

రోజుకు యాభై అరవై రూపాయల సంపాదన కనిపిస్తోంది. ఆ సొమ్మును దాచుకుని మొబైల్ టైలరింగు షాపును మరింత ఆకర్షణీయంగా తయారు చేశాడు. ఇస్త్రీ పెట్టెను కొనుగోలు చేసి కుట్టిన బట్టలను తానే ఇస్త్రీ చేసి వినియోగదారులకు అందిస్తున్నాడు. కొత్త కొత్త ఫ్యాషన్లతో బట్టలు కుడుతుండటంతో కొంతమంది యువకులు కూడా ఆకర్షితులవుతున్నారు. కాన్వెంట్ల యజమానుల వద్దకు వెళ్ళి స్కూలు డ్రస్సులు కుట్టడానికి కూడా ఒప్పందం కుదుర్చుకుంటున్నాడు. తనకు కాజాలు, గుండీలు కుట్టడానికి వీలుగా ఇద్దరు కుర్రవాళ్ళను పనికి కుదుర్చుకున్నాడు.

కొత్తగా చేతికి రెండు ఉంగరాలు కొనుక్కున్నాడు.

విశాఖపట్నం సెంటర్‌లో కొత్తగా టైలరింగ్ షాపు పెట్టాలన్న ఆలోచనలో ఉన్నాడు.

సోపేటి ఎల్లయ్యకు ఎంతో సంతృప్తిగా ఉంది.

* * *

"మా పాపకు అందమైన గౌను కుట్టాలి-" అంటూ ఒకామె పాత చీరను ఎల్లయ్యకు ఇచ్చింది. "ఎక్కువ కుచ్చీలు ఉండాలి... ఎల్లుండి ఇచ్చేయాలి..." ఆమె చెప్పి పాత గౌను కొలతల కోసం ఇచ్చి వెళ్ళిపోయింది.

ఎల్లయ్య కష్టపడి అందంగా గౌను కుట్టాడు. రిబ్బను ముక్కలతో గౌను మీద రెండు పువ్వుల్లా కూడా కుట్టాడు.

ఆ సాయంత్రం-

పకోడి బండిని తోసుకుని బుగత అప్పారావు వచ్చాడు - "టైలరు అంటే ఎవరో అనుకున్నాను. నువ్వేనా?" పలకరించాడు.

అప్పారావును చూసి ఎల్లయ్య ఎంతో ఆనందపడ్డాడు. కుట్టుమిషను దిగి పకోడి బండి వద్దకు వచ్చాడు. పక్కనున్న కిళ్ళీ కొట్టులోంచి కూల్‌డ్రింక్ తెచ్చి ఇచ్చాడు - "నువ్వు ఆ రోజు రాత్రి చెప్పిన మాటలు మరిచిపోలేను... నీ ప్రోత్సాహమే ఈ బండిని తయారు చేయించింది. మళ్లీ నన్ను టైలర్‌ను చేసింది-" అన్నాడు.

తర్వాత అప్పారావు వేడివేడి మసాలా గారెలు ఎల్లయ్యకు ఇచ్చాడు. వారిద్దరు చాలాసేపు కబుర్లలో పడిపోయారు. ఎన్నో విషయాలు... విశేషాలు..

"పాపకు గౌను కుట్టాలని మా ఆవిడ చీర ఇచ్చిందట. కుట్టేశావా?"

"మీ పాప గౌనా? ఎవరో అనుకున్నాను... నిన్నే కుట్టేశాను-" అంటూ తోపుడు బండి మీద వేలాడదీసిన గౌను తీసుకువచ్చి అప్పారావు చేతిలో పెట్టాడు.

అటు ఇటు తిప్పి "చీర పాతదే కాని రెడీమేడ్ గౌనులా కుట్టావు.... నీలో గొప్ప కళ ఉంది-" అప్పారావు అభినందించాడు.... తర్వాత "ఎంత కుట్టుకూలి-" నెమ్మదిగా అడిగాడు.

"కుట్టుకూలా... నీ వద్దా?

"ఏం?"

"నీ మాటల వల్ల నేను ఈ విధంగా ఉపాధి పొందుతున్నాను... ఒకప్పుడు నేను దర్జీని... కాని ఇప్పుడు దర్జాగా బతికే దర్జీని... ఈ గౌను పాపకు నా బహుమతి..." అన్నాడు ఎల్లయ్య.

ఆ తర్వాత మొబైల్ టైలరింగు షాపును తోసుకుంటూ ముందుకు సాగిపోయాడు ఎల్లయ్య. అప్పారావు కదిలిపోతున్న ఎల్లయ్య షాపును చూస్తుండి పోయాడు.

ఆ షాపును తోసుకువెళుతున్న దర్జీ ఎల్లయ్యలో నిబ్బరమైన దర్జా కనిపిస్తోంది. ●



కె.పి.అశోక్‌కుమార్

సామాజిక వాస్తవికతను ప్రతిబింబించే నవలలు

సమాజంలోని అసమానతలను, సామాజిక వ్యవస్థలోని వివిధ రంగాలలో పేరుకుపోయిన కుళ్ళును, అవినీతిని బట్టబయలు చేసే ఈ వాసిరెడ్డి సీతాదేవి నవలలు అప్పట్లోనే అశేష పాఠకాదరణతో పెద్ద సంచలనం సృష్టించాయి.

పంచాయితీరాజ్ వ్యవస్థలోని అరాచకత్వాన్ని, అవినీతిని, కుళ్ళు రాజకీయాలను తేటతెల్లం చేసిన నవల "రాబందులు-రామచిలుకలు". స్వాతంత్ర్యం కోసం ఆస్తినంతా ధారపోసి లాఠీ దెబ్బలు తిని జైళ్ళకువెళ్ళిన గాంధేయవాది ధర్మయ్య ఆదర్శవాది, త్యాగమూర్తిగా మిగిలిపోయాడు. పొగడ్తలకు లొంగక, నిరాడంబర జీవితంతో, ఇతరుల మంచికోసం నిస్వార్థంగా పాటుపడే ధర్మయ్య నిన్నటి తరానికి ప్రతినిధి. స్వాతంత్ర్య సమరయోధుడిగా అవార్డులు, భూములు తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించి, అది తన కర్తవ్యంగా భావించిన నిస్వార్థజీవి. పదవుల కోసం రాజకీయాలు నడిపి దానికోసం రక్తసంబంధీకులనైనా అడ్డు తొలగించుకోవాలనుకునే పరమేశం, సమితి ప్రెసిడెంటుగా అవినీతిపరుడైన నరహరి, నాసిరకం కాంట్రాక్టులతో ప్రజాధనం కొల్లగొట్టే లూ అనే కాంట్రాక్టర్, సోషల్ వర్కర్ ముసుగులో రాజకీయాలు నడిపే మిసెస్ వైకుంఠం, అధికార వర్గాలకు పెంపుడు కుక్కలా పని చేసే పుణ్యశ్రీ అనే పత్రికా సంపాదకుడు - వాళ్ళంతా ఈ వ్యవస్థను తొలిచేసే చీడపురుగులు. ధర్మయ్య ఆశయాలకు అనుగుణంగా పెరిగిన సునంద సంఘసేవికగా మారి ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలనుకుంటే ఎక్కడికక్కడ అడ్డంకులు. గ్రామీణ వ్యవస్థలో గూడుకట్టుకొని వున్న అవినీతిని ఎదిరించబోయి ఆమె ఎన్నో అవమానాలకు గురవుతుంది. చివరకు తన వ్యక్తిగత జీవితాన్ని ప్రజాసేవకే వినియోగించడానికి ఆమె చేసిన ప్రయత్నంలో తన వైవాహిక జీవితమే విచ్ఛిన్నమైనా వెనుదీయక తాను నమ్మిన ఆశయాలకే కట్టుబడి ఉంటుంది. వీరేకాక ఆడంబరాలకు - అతిశయాలకు పోయి విలాస జీవితాన్ని గడిపే పరమేశం కూతురు రాణి, విలాసవంతమైన జీవితాన్ని కోరుకొని తప్పుడుగులు వేసిన లలిత - ఇలా రకరకాల మనస్తత్వాలు కలిగిన వ్యక్తులు మనకు ఇందులో తారసపడతారు. మంచికి, చెడుకు మధ్య జరిగిన పోరాటంలో చివరకు ధర్మమే గెలిచి కథ సుఖాంతమవుతుంది.

వాసిరెడ్డి సీతాదేవి నవలలు-5
(రాబందులు-రామచిలుకలు, మృగతృష్ణ సావేరి)
ముద్రణ, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని బ్రాంచీలు
వెల : రు.200/-

దారిద్ర్యం ఎంత భయంకరమైనదో, అది కుటుంబ సభ్యుల మధ్య వుండే అనుబంధాలను కూడా ఎలా నాశనం చేస్తుందో వివరించే కథ 'మృగతృష్ణ'. దారిద్ర్యాన్ని భరించలేక తల్లి ఆత్మహత్య చేసుకోవడం, అన్నయ్య జైలు పాలు కావడం, తమ్ముణ్ణి దత్తత చేసుకోవడం, తండ్రి బైరాగుల్లో కలిసిపోతే, చెల్లిని పనిమనిషిగా అక్క తన ఇంటికి తీసుకుని పోతే ఏకాకిగా మిగిలిన సునందను రమణమ్మ అనే ముసలావిడ చేరదీస్తుంది. సునంద గ్రాడ్యుయేషన్ పూర్తి చేసేలోపు రమణమ్మ చనిపోవడం, దాయాదులు సునందను వెళ్ళగొట్టడంతో ఆమె ఏకాకిగా మిగిలిపోతుంది. ప్రేమించిన క్లాస్‌మేట్ రవీంద్ర అండగా నిలవడంతో చివరకు ఆమెకు ఉద్యోగం దొరుకుతుంది. అక్కడ ఆమె పట్ల ఆకర్షితుడైన ఆమె బాస్ కృష్ణ ప్రసాద్ తనను పెళ్ళి చేసుకోమని అడిగితే ఒప్పుకుంటుంది. అక్కడ రవీంద్రకు ఉద్యోగం ఇప్పిస్తుంది. జీవితాంతం అనుభవించిన దారిద్ర్యానికి దూరంగా సెక్యూరిటీ కోసం ఆమె ఈ పెళ్ళి చేసుకోవాలనుకుంటుంది. తనకంటే వయసులో పెద్ద, భార్యా వియోగి, ఇద్దరు పిల్లల తండ్రిని పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకున్నా పాతజ్ఞాపకాలతో ఆమె మానసిక సంఘర్షణకు తట్టుకోలేకపోతుంది. అది గమనించిన కృష్ణప్రసాద్ ఆమెను రవీంద్ర దగ్గరకు చేర్చే లోపల రవీంద్ర, సునంద ఫ్రెండ్ సుజాతను పెళ్ళి చేసుకొని రావడం గమనించి మూర్ఛపడిపోతుండగా కృష్ణప్రసాద్ ఆమెను పొదివి పట్టుకోవడంతో నవల ముగుస్తుంది. ఈ నవలను పాఠకులు ఆశ్చర్యపోయే విధంగా కొసమెరుపుతో ముగించడం విశేషం. సునంద నిర్ణయం తీసుకున్న మూడు రోజులకే, ఆమెను అంతగా ప్రేమించిన రవీంద్ర అంత అర్జంటుగా సుజాతను పెళ్ళి చేసుకోవడం నమ్మశక్యంగా లేకపోయినా, కథ నడిపించిన తీరు, ఆ వేగంతో, ఆ ముగింపు షాక్‌లా తగులుతుంది పాఠకులకు. పడిపోతున్న సునందను కృష్ణప్రసాద్ పట్టుకున్నాడని ముగించడంతో ఇక జీవితాంతం ఆమెకు అతను ఆసరాగా నిలవబోతున్నాడని మనం తెలుసుకుంటాం. ఫ్లాష్‌బ్యాక్‌లతో ఈ నవల ఒక సినిమాలా చకచకా సాగిపోతుంది.

తళుకు బెళుకులతో కళ్ళు మిరుమిట్లు గొలిపే సినీ ప్రపంచం ఒక నరకకూపం లాంటిది. ఆ మాయా ప్రపంచం పట్ల ఆకర్షితుడై ఆ ఊబిలో చిక్కుకుపోయేవారు కొందరు కాగా, ఆ ఊబిలోంచి బయటపడటానికి ప్రయత్నించి అందులోనే అణగారిపోయే వాళ్ళు ఎందరో. సినీమాయా ప్రపంచాన్ని చిత్రీకరించిన 'సావేరి' నవలలో, రేఖ అనే నేపథ్యగాయని ప్రేమించి పెళ్ళి చేసుకున్న దత్తు అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి నుండి ప్రముఖ దర్శకుడిగా ఎదుగుతారు. రేఖ అనుమానంతో ఎప్పటికప్పుడు అతణ్ని వేధిస్తూ, విసిగిస్తూ మనశ్శాంతి లేకుండా చేస్తుంది. తన సినిమాలో కొత్తగా పరిచయం చేసిన రజియా అనే నటి ఆకర్షణలో పడిన దత్తు రేఖకు విడాకులు ఇవ్వలేక, రజియాను పెళ్ళి చేసుకోలేక, ఇద్దరి తిరస్కారానికి గురై ఆత్మహత్య చేసుకుంటాడు. తాగుడుకు అలవాటు పడిన రేఖ సర్వనాశనమైపోగా, పిల్లలు అనాథలుగా మిగిలిపోతారు. ఆ పిల్లలను తన పిల్లలుగా పెంచుకోవడానికి రజియా సిద్ధపడటంతో నవల ముగుస్తుంది. అగ్రతారల అంగీకారాలు, దర్శకుల స్వీయవ్యక్తిత్వం, నిర్మాతల వ్యాపార ధోరణి, రచయిత వీరంగాలు, ఎక్స్ట్రా నటీనటుల జీవితాలు, సినీ పత్రికల గాసిప్స్ ఇలా ఒకటేమిటి సినీ పరిశ్రమలోని అన్ని కోణాలను ఈ నవల అద్భుతంగా చిత్రీకరించగలిగింది. అయితే ఈ నవల చదువుతుంటే దత్తు స్థానంలో హిందీనటుడు, దర్శకుడు గురుదత్, రజియా స్థానంలో వహీదా రెహమాన్ తప్పకుండా జ్ఞాపకం వస్తారు. ఇంకొంతమంది పాత నటీనటుల ఆనవాళ్ళు కూడా కొన్ని పాత్రల్లో కనిస్తాయి. సినిమా ప్రపంచం మీద వున్న అతికొద్ది నవలల్లో, అత్యంత ఆసక్తికరంగా రూపొందిన ఈ నవల మొదలెడితే చాలు చివరిదాకా లాక్కెళుతుంది. ●

సమాజంలో ఒక్కొక్కరికి ఒక్కో అభిరుచి. కొందరి అభిరుచి, అలవాట్లు సమాజాన్ని చైతన్యపరడానికి పత్యక్షంగానో, పరోక్షంగానో దోహదపడుతుంటాయి. అలాంటి వారిలో నాగప్ప ఒకరు. పెనుకొండలోని రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న నాగప్పకు నాణేలు, విదేశీ కరెన్సీ నోట్లు సేకరించడం హాబీ. తన అభిరుచి ద్వారా పురాతన విషయాలను వెలికితీస్తూ భవిష్యత్ తరాలకు చారిత్రాత్మక విషయాలను నిక్షిప్తంచేస్తున్న నాగప్ప కళాభిరుచి గురించి ఈ వారం తెలుసుకుందాం!

పురాతన నాణేల సేకరణలో నాగప్ప దిట్ట

కేవలం హాబీగానే కాకుండా పురాతన కాలంనాటి చారిత్రాత్మక అంశాలనుకూడా తెలుసుకోవడానికి ఈ హాబీ ఉపయోగపడుతుందని నాగప్ప పేర్కొంటారు. నాగప్ప సేకరించిన నాణేల వలన ప్రాచీన కాలంలో నాణేలకు వాడిన లోహం, వాటి మీద గల లాంఛనాలు, బొమ్మలు, ఆకృతులు ఆధారంగా ఆనాటి రాజకీయ, ఆర్థిక, మత, వాణిజ్య పరిస్థితులను తెలుసుకోవచ్చు. తాను సేకరించిన దేశ విదేశీ నాణేలు, కరెన్సీని అనేక సందర్భాలలో వివిధ పాఠశాలల్లో, ఇతరత్రా కార్యక్రమాల్లో ప్రదర్శిస్తూ చారిత్రాత్మక సత్యాలను వెల్లడి చేస్తున్నారు. నాగప్ప నాణేల సేకరణలో అనుభవాన్ని



గడించడంవల్ల జిల్లా, రాష్ట్ర స్థాయిలో వందలాది ఆహ్వానాలను పొందారు.

1103 సంవత్సర కాలంనాటి నాణెం నాగప్ప సేకరించిన అతిపురాతన నాణేల్లో ఒకటి. హిందూమత సంప్రదాయాన్ని ఈ నాణెంపై ముద్రించినట్లు దానిపైనున్న ఆధారాల ద్వారా తెలుస్తోంది. విజయనగరం, కాకతీయులు, విక్టోరియారాణి, హైదరాబాద్ నవాబ్, ఐదవ జార్జ్ కింగ్ ఎంపైర్, ఏడవ ఎడ్వర్డ్‌రాజు తదితర కాలాలకు సంబంధించిన నాణేలను నాగప్ప సేకరించారు. 1835 నాటి అణాలు, అప్పటిలోనే తెలుగులో ముద్రించిన విక్టోరియారాణి రెండు అణాల నాణేలు, అరబిక్ లిపిలో ముద్రించిన నాణేలు, అలాగే ముచ్చటగొలిపే చిత్రాలున్న నాణేలు ఇలా అనేక రకాల నాణేలు ఆయన సేకరించిన వాటిలో ఉన్నాయి. నాగప్ప సేకరించిన వాటిలో మలేషియా, టాంజానియా, శ్రీలంక, ఆస్ట్రేలియా, భూటాన్, సింగపూర్ తదితర దేశాలకు చెందిన పురాతన నాణేలు ఉన్నాయి. అంతేకాకుండా వివిధ దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు, అచ్చు తప్పులున్న నోట్లు, ఒకే నెంబరుగల రెండు నోట్లు నాగప్ప సేకరించిన వాటిలో ఉన్నాయి. విదేశీ పాలకులు సైతం తెలుగు భాషలో నాణేలు ముద్రించారన్న విషయాన్ని నాగప్ప సేకరించిన నాణేలు తెలియజేస్తున్నాయి. ఆర్థిక పరంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ పట్టుదలతో నాణేలు, కరెన్సీని సేకరిస్తున్నానని నాగప్ప పేర్కొన్నారు. ముందుతరాలవారికి చారిత్రాత్మక సత్యాలను తెలియజెప్పే నాణేల సేకరణ హాబీలో నాగప్ప కృషి మరింతగా ఫలించాలని కోరుకుందాం.

✻ డా॥ సుమతి

ప్రస్తుతం సమాజంలో ఏదో ఒక రకమైన ఆరోగ్య సమస్యతో బాధపడే వారిని అన్ని వయస్సుల వారిలో చూస్తున్నాం. మధుమేహ వ్యాధి, గుండె జబ్బులు, కీళ్ళ సమస్యలు లాంటివి గతంలో కొంచెం వయస్సు పైబడిన వారిలో మాత్రమే కనిపిస్తుండేవి. కాని ఇప్పుడు వయస్సుతో నిమిత్తం లేకుండా ఏ వయస్సు వారైనా, ఏ ఆరోగ్య సమస్యతోనైనా బాధపడటం చూస్తున్నాం. ఇటువంటి పరిస్థితికి చాలా కారణాలు ఉన్నాయి. అందులో ముఖ్యమైన కారణం మన జీవన పద్ధతులలో జరుగుతున్నటువంటి మార్పులు. ఈ మార్పులలో మొదటిది శారీరక నిస్తబ్దత. రెండవది ఆహారపు అలవాట్లలో చూస్తున్నటువంటి ఆందోళనకరమైన మార్పు.

శారీరక వ్యాయామం ఉపయోగాలు



మన దేశంలో గత కొద్ది సంవత్సరాలుగా సామాజిక, ఆర్థిక పరిస్థితులు మెరుగు పడటం వలన చాలా మంది ప్రజల నెలసరి ఆదాయంలో గణనీయమైన పెరుగుదల గమనిస్తున్నాం. ఇది ఒక రకంగా సంతోషించాల్సిన విషయమే. కాని ఈ ఆర్థిక పరిస్థితుల మెరుగుదల వలన కానీండి, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందటం వలన కానీండి ప్రజలలో ఒకరకమైన శారీరక నిస్తబ్దత ఏర్పడుతూ వస్తోంది. ఉదాహరణకు స్త్రీలు వంట చేసుకోవటానికి ముందులాగ శారీరకంగా ఏమీ కష్టపడాల్సిన అవసరం ఇప్పుడు లేదు. శక్తిని ఉపయోగించి చేయాల్సిన పనులన్నింటికీ ఇప్పుడు ఎలక్ట్రానిక్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అందువలన చాలా వరకు శ్రమ తగ్గినట్లే. ఇదీ ఒక రకంగా మంచిదే. స్త్రీలు వంటింట్లో అలా కష్టపడాల్సిన అవసరం లేదు. కాని ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సిన విషయమేమిటంటే ఇలా వంటింట్లో పని తగ్గటం వలన ఆదా చేసుకునే సమయాన్ని స్త్రీలు సరిగా ఉపయోగించుకుంటే తమ ఆరోగ్యాన్ని చాలా జాగ్రత్తగా కాపాడుకోవచ్చు. ఈ సమయాన్ని ఏదో ఒక రకమైన శారీరక వ్యాయామం చేయటానికి ఉపయోగించుకోవాలి.

ఏ వయసు వారిలోనైనా, ఏ కొంచెం దూరమైనా నడిచి వెళ్ళటం అనేది ఇప్పుడు చాలా తక్కువగా చూస్తున్నాం. దీనికి రకరకాల కారణాలు చెప్తుంటారు. ముఖ్యంగా వినిపించే కారణం సమయాభావం. ఈ అలవాటు కూడా ఆరోగ్యానికి మంచిది కాదు. అలాగే ఏ వయస్సు వారైనా లిఫ్ట్ వాడడం అనేది కూడా సర్వసాధారణమైపోయింది. ఎటువంటి ఆరోగ్య సమస్యలేని వారు వీలైనంత వరకు మెట్లు ఎక్కి దిగటం ఆరోగ్యానికి చాలా మంచిది. విద్యార్థులు, విద్యార్థినులు సమయం ఆదా చేయాలనే ఉద్దేశంతో కానీండి, ఒక వాహనం కావాలనే కోరిక తీర్చుకోవటానికి కానీండి ఇప్పుడు చాలా వరకు ఏదో ఒక రకమైన వాహనాన్ని ఉపయోగించటం బాగా అలవాటైపోయింది. దీనివలన కూడా శారీరక వ్యాయామం ఈ వయస్సు నుండే తగ్గిపోతోంది. దానికి తోడు ఆటలు ఆడటం అనేది కూడా విద్యా సంస్థలలో చాలా వరకు నామమాత్రంగా మిగిలిపోయింది. ఈ పోటీ చదువుల కార్యక్రమాలలో పిల్లలు, వారి తల్లిదండ్రులు కూడా సమయం ఆదా చేయాలనే ఆలోచిస్తున్నారు కాని ఈ ప్రక్రియలో పిల్లల ఆరోగ్యానికి ఎదురయ్యే సమస్యల గురించి ఆలోచించట్లేదు. దీనికి తోడు టెలివిజన్ చూడటం, కంప్యూటర్ ముందు సమయం గడపటం, వీడియో గేమ్స్ ఆడటం లాంటి కార్యక్రమాల ద్వారా ఇంకా శారీరక నిస్తబ్దత ఎక్కువ అవటమే కాకుండా ఈ సమయాలలో ఏదో ఒక చిరుతిండి అదీ ముఖ్యంగా చిప్స్ లాంటివి తీసుకోవటం వలన నష్టం ఇంకా ఎక్కువగా జరుగుతోంది.



ఇలా ఏ కారణాల వలన అయితేనేమి, అన్ని వయస్సుల వారిలో స్త్రీలలో, పురుషులలో శారీరక వ్యాయామం చాలా తక్కువ అవుతుండటంతో పాటు, ఆహార విషయాలలో కూడా చాలా మార్పులు రావటం వలన ఆరోగ్య సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. కారణాలు ఏవైనప్పటికీ, ప్రస్తుతం ప్రజల ఆహారపుటలవాట్లలో జరుగుతున్నటువంటి మార్పులు చాలా అసంతృప్తికరంగా వున్నాయి. పాశ్చాత్య దేశాల ఆహారపు అలవాట్ల ప్రభావం మన దేశ విద్యార్థుల ఆహారపు అలవాట్లపైన చాలా ఎక్కువగా కనిపిస్తోంది. ఇప్పుడు ప్రతి విద్యార్థికి పీజాలు, బర్గర్స్, శీతల పానీయాల మీద ఉన్నటువంటి మోజు మన సాంప్రదాయక అల్పాహారం మీదకాని, పండ్ల రసాల మీద కాని లేదు. ఇందువలన మనకు రెండు రకాల నష్టాలు జరుగుతున్నాయి. సాంప్రదాయక వంట ద్వారా కాని, పండ్ల రసాలు, మజ్జిగ లాంటి పానీయాల ద్వారా కాని లభ్యమయ్యేటటువంటి పోషకాలు ముఖ్యంగా సూక్ష్మపోషకాలు ఈ ఆధునిక ఆహార పదార్థాల ద్వారా అంతగా లభ్యం కావు. అంతేకాకుండా ఈ ఆధునిక ఆహార పదార్థాల తయారీలో ఉపయోగించే ముడి పదార్థాలైనటువంటి మైదాకాని, నూనె సంబంధిత పదార్థాల ద్వారాకాని ఒక్క శక్తి మాత్రమే శరీరానికి లభ్యం కాగా, ఈ పదార్థాలు నిల్వ చేయటానికి ఉపయోగించే రసాయనాల వలన మన ఆరోగ్యానికి నష్టం కలిగే అవకాశముంది. మంచి



పోషకాలున్నటువంటి రకరకాల పండ్ల వాడకం కూడా ఇప్పటి విద్యార్థులలో చాలా తక్కువగానే ఉంటుంది. ఇలా మంచి ఆరోగ్యానికి దోహదం చేసేటటువంటి పోషకాలున్న ఆహార పదార్థాల వాడకం తగ్గించడం వలన, ఆరోగ్యానికి నష్టం కలిగించేటటువంటి పదార్థాలున్న ఆహారం తీసుకోవటం వలన ఇప్పటి యువతలో చాలా రకాలైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

ఇప్పటి పరిస్థితులలో ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలంటే రెండు ముఖ్యమైన సమస్యలను పరిష్కరించుకోవాలి. క్రమం తప్పకుండా ఏదో ఒక రకమైన శారీరక వ్యాయామం చెయ్యటం వలన ఆహార అరుగుదల పెరగటం, రక్తప్రసరణ సరిగా జరగటం, మధుమేహ వ్యాధిలాంటివి రాకుండా అరికట్టడం లేదా మధుమేహ వ్యాధిని అదుపులో ఉంచటం, గుండెజబ్బులు వచ్చే అవకాశాన్ని తగ్గించటం, బరువు తగ్గటం, ఎముకలు, కీళ్ళు, కండరాల పటిష్టత పెంపొందించటం, రక్తపోటు అదుపులో ఉంచుకోవటం, రోగనిరోధక శక్తి పెంచుకోవడం లాంటి ఎన్నో రకాల లాభాలను పొందవచ్చు. అంతేకాకుండా వ్యాయామం చెయ్యటం వలన శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కూడా పెరుగుతుందని చాలా పరిశోధనలు తెలియచేస్తున్నాయి. మానసిక ఒత్తిడులు, మానసిక అలజడుల లాంటివి తగ్గటమే కాకుండా నిద్ర బాగా పట్టడం, మనసు ఆహ్లాదకరంగా ఉండటం వలన చాలా మార్పులు జరిగి జీవితం సంతోషమయం అవుతుంది. ఇలా శారీరక వ్యాయామంతో పాటు ప్రతిరోజూ మనం తీసుకోవలసినంత మోతాదులో పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పాలు, పీచు పదార్థాలు తీసుకుంటూ నూనె సంబంధిత పదార్థాలు తక్కువ తీసుకోవటం వలన ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవచ్చు.

శారీరక వ్యాయామం ఎప్పుడు, ఎలా మొదలు పెట్టాలి?

ఎవరైనా, ఏ వయసు వారైనా శారీరక వ్యాయామం చెయ్యవచ్చు. కాకపోతే మధుమేహ వ్యాధి, గుండెజబ్బులు, కీళ్ళనొప్పులు లాంటి కొన్ని ఆరోగ్య సమస్యలుండే వాళ్ళు తమ వైద్యుని సంప్రదించి మొదలు పెట్టాలి. ఎలాంటి వ్యాయామం చెయ్యాలి అని కూడా చాలా మందికి అనుమానాలు వస్తుంటాయి. మనకున్న సమయంలో మనకనుకూలమైన ఏ రకమైన వ్యాయామాన్నైనా ఎన్నుకోవచ్చు. వీలుంటే ప్రతిరోజూ 30-45 నిముషాలు మంచి వాతావరణంలో నడవవచ్చు లేదా 30 నిమిషాలు నడిచి మరో పదిహేను నిముషాలు కండరాల శక్తికోసం ఏదైనా వ్యాయామం చేసుకోవచ్చు. లేదా మన కనుకూలంగా ఉండేటటువంటి యోగాసనాలు వేసుకోవచ్చు. ఇలా ఏదో ఒక వ్యాయామం క్రమం తప్పకుండా ప్రతిరోజూ చేయటం మాత్రం అలవాటు చేసుకోవాలి.

ఇలా వ్యాయామం చేయటం వలన శరీరంలో ఉండేటటువంటి కొవ్వు పదార్థం తగ్గి, కండరాల శక్తి పెరగటమే కాకుండా శరీర బరువు తగ్గటం వలన చాలా ఆరోగ్య సమస్యల నుండి రక్షణ కలుగుతుంది. ఒకేసారి 30-45 నిముషాల సమయం దొరకకపోతే రోజులో రెండుసార్లు కూడాచేసుకోవచ్చు. ఇలా వ్యాయామ పద్ధతులు అవలంబిస్తూనే, మరికొన్ని అలవాట్లలో కూడా మార్పులు చేసుకోవచ్చు. ఉదాహరణకు సాధ్యమైనంత వరకు మెట్లు ఎక్కి దిగడం, తోటపని చేసుకోవటం, ఇంట్లో చిన్న చిన్న పనులు చేసుకోవటం లాంటి అలవాట్లు చేసుకోవచ్చు. ఈ పనులన్నింటికీ సమయం లేదనుకుంటే అనారోగ్య పరిస్థితికి సమయం దగ్గర పడుతుందన్నమాట. వ్యాయామం చెయ్యకుండా తప్పించుకోవటానికి చాలా కారణాలు కనిపిస్తుంటాయి. చాలా బిజీగా ఉన్నామనో, చాలా అలసిపోయామనో, అనుకూల పరిస్థితులు లేవనో, ఆరోగ్యం సరిగాలేదనో, ఇలా ఎన్నో సాకులు చెప్తుంటాము. ఈ సాకుల నుండి తప్పించుకుని క్రమంగా వ్యాయామం చెయ్యటానికి ఎంత త్వరగా అలవాటు పడతామో అంత త్వరగా మంచి ఆరోగ్యాన్ని పొందగలుగుతాము. అందువలన ఈ సాకుల నుండి బయటపడటానికి గట్టి ప్రయత్నం చెయ్యాలి. కొంచెం అలవాటు అయితే తర్వాత వ్యాయామం కష్టం అనిపించదు. ముందు నిదానంగా మొదలు పెట్టి తరువాత వ్యాయామం చేసే సమయాన్ని పెంచుకోవచ్చు. కాని ఒక విషయం ముఖ్యంగా గుర్తుంచుకోవాలి. మనకు బాధ కలిగించే వరకూ ఏ వ్యాయామం చెయ్యకూడదు. ఏ రకమైన వ్యాయామమైనా మనకు శరీర సుఖం, మానసిక ఆనందం కలిగించాలి. ఇలా మనకు అనుకూలమైన వ్యాయామం చేస్తూ, మంచి ఆహారపు అలవాట్లు పాటిస్తే ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవచ్చు. ●



డాక్టర్ జి.ఎస్.కె.శేఖర్,
జనవిజ్ఞాన వేదిక, సబ్‌కమిటీ
మెంబర్, హైదరాబాద్

◆ నేను గత సంవత్సర కాలంగా కంటి సంబంధ వ్యాధితో బాధపడుతున్నాను. నా వయస్సు 17 సంవత్సరాలు. పుట్టకతో ఇప్పటివరకు ఒక కన్ను (కుడి కన్ను) పూర్తిగా చూపును కోల్పోయింది. రెండవ కంటిలో 2.50 పాయింటెడ్ ఉంది. సమస్య ఏమిటనగా నేను గత సంవత్సర కాలంగా వెలుతురు (కాంతిని) చూడటం కష్టంగా మారింది. వెలుతురు చూస్తే కళ్ళలో మంటలు పుదుతున్నాయి. లోకల్ డాక్టర్స్‌తో ఈ సమస్య పరిష్కారం కావడం లేదు. హైదరాబాద్‌లో కామినేని హాస్పిటల్‌లోనూ ఈ సమస్యకు పరిష్కారం లభించలేదు. కావున నా యందు దయ ఉంచి ఈ సమస్యకు పరిష్కారం తెలుపుతారని ఆశిస్తున్నాను.

\- ఒక పాఠకుడు.

మీరు హైదరాబాద్‌లోని ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రిలో చూపించుకోండి. ఎడమ కంటి చూపు తగ్గిపోకుండా, ఇతర సమస్యలు లేకుండా చేయగల అవకాశం వుంది. మీరు ఇంతకుముందు చేయించిన పరీక్ష రిపోర్టులు, వాడిన మందుల చీటీలు తప్పకుండా వెంట తీసుకెళ్ళండి. మీకు తెల్లరేషన్ కార్డు వుంటే అక్కడ ఉచితంగా చూస్తారు. ●

* కొండబాబు

వాక్యానికి ఊతం..

"వాక్యాల్లో విషయానికి అడ్డుపడుతుండేవి ఊతపదాలు, వ్యర్థపదాలు. అలాంటి వాటి గురించోయ్ ఈ ప్రతి" ఇచ్చాడు కైలాసం. సుబ్రహ్మణ్యం దీక్షంగా చదవడం మొదలెట్టాడు.

"మాట్లాడేప్పుడు కొందరికి కొన్ని ఊతపదాలు దొర్లుతాయి. అదికాదు, ఇప్పుడు, .. మరీ.. మరేంటంటే.. లాంటివి. వేదికపై నుంచి మాట్లాడేటప్పుడు ఇంకా ఎక్కువ యివి. అనేటువంటివి.. పోతే, ఇకపోతే, అధ్యక్ష.. విన్నవించడం, మనవిజేసుకోవడం, తెలియజేసుకోవడం వంటివి. అయితే.., ఇలాంటి, ఇవిలా ఉండగా, కాగా, పోగా, మరియు లాంటివి రాసేప్పుడు వస్తుంటాయి.

వివరాలిలా వున్నాయి. అభివృద్ధి చేయడం జరిగింది.. తెలియజేయడం జరిగిందని చెప్పారు.. కూడా ఇలాంటివే. ఇంకా.. పాల్గొని ప్రసంగించారు.. గెలుపొందిన విజేతలకు.. అధ్యక్షత వహించి.. అధ్యక్షోపన్యాసం చేస్తూ.. లాంటివన్నీ.

వీటన్నింటి వల్లా పత్రికలో స్థలం, పాఠకుల సమయం వృథా తప్ప ఉపయోగం ఉండదు. అంతకుమించి ఊత, వ్యర్థపదాలు సక్రమంగా చదవనీయవు. పాఠకుడికి అడ్డుపడుతుంటాయి. అందువల్ల సమాచారాన్నివ్వాలన్న మన ఉద్దేశం నెరవేరదు.

మనకే సరిగా తెలియనప్పుడు కాస్త అటూఇటుగా చెపుతాం. ఒక్కోసారి ఈ అటూ ఇటూ అటో ఇటో అయిపోతుంది. అప్పుడే ప్రమాదవొచ్చి పడుతుంది. కాబట్టి అంచనా పదాలు ఎప్పుడూ ప్రమాదకరమైనవే. దాదాపు, సుమారు, కావచ్చు, జరగవచ్చు, జరగకపోవచ్చు, తెలిసింది, తెలుస్తోంది.. వంటివి అలాంటివే. అంకెల సంఖ్యలలో చెప్పినప్పుడు సుమారు దాదాపు కోట్లాదిమంది, కోటిమందికి పైగా వంటి పదాలు నమ్మకాన్ని కల్గించవు. పాఠకుడిని సంఖ్యలు, ఆధారాలతో ఒప్పించాలనుకున్నప్పుడు సుమారు, దాదాపు జోలికి పోకూడదు. అనివార్యమైనప్పుడూ, విశ్వసనీయతకు ప్రమాదం లేదనుకున్నపుడు మాత్రమే వీటిని వాడాలి. జరగవచ్చు, జరగకపోవచ్చు అనేవి మన అంచనాలకు సంబంధించినవి. తగిన ఆధారాలు లేకుండా ఊహా భరితంగా చెప్పకూడనివివి. వీటిని పాఠకులు విశ్వసించాలి. ఇంతకంటే ప్రమాదమైనవి 'తెలిసింది'. వార్తల్లో తెలిసింది అనే పదం వల్ల పాఠకులకు తొలుత రాసినాయన బద్ధకం తెలుస్తుంది. ఆ విషయంలో నిజం లేదని కూడా తెలుస్తుంది. కర్ణాకర్ణిగా విన్న విషయాలే వార్తలు కావు. నిర్ధారించుకునే రాయాలి. ఇలా 'తెలిసింది' అనే పదాలతో మనకు ఇష్టంలేని, ఇష్టమైన, జనం లేదా మనం అనుకునే మాటలు ఏదైనా రాసుకోవచ్చన్నమాట. కలెక్టరు లంచగొండని తెలిసింది, ముఖ్యమంత్రి రాజీనామా చేస్తాడని తెలిసింది.. ఇలా రాయొచ్చన్నమాట. ఇలా రాసినా, రాయకపోయినా వీటికి ఎంత విశ్వసనీయత ఉంటుందో గ్యాస్ వార్తకూ అంతే విశ్వసనీయత ఉంటుంది.

పదాల అసలు రూపం తెలియక ఏదో ఒకటి రాస్తుంటారు. దగ్గరగా వున్న పదాల మధ్య సమాసం కూర్చి 'ఈ అవినీతి కేసులో దర్యాప్తు అధికారికి సహకరించడం లేదు' అని. వ్యాకరణవేత్తలు.. అని కూడా రాస్తుంటారు. ఇలాంటి సాహసికులు తక్కువే ఉండటం మన అదృష్టం.

ఒక భావానికి సరిపడా పదం దొరక్కపోతే ఏదో ఒక పదం వాడేస్తుంటారు మరికొందరు. అలా రాసేసి ఆయన 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకోవచ్చేమో కానీ, చదివిన పాఠకుడు అమ్మో.. అయ్యో.. అని పొట్టపట్టుకుని నవ్వడం ఖాయం. 'మాజీ ఎంఎల్ఎ సుబ్బారావు ఆసుపత్రి నుండి విడుదలయ్యారు' అని రాశాడొకాయన. ఇలా రాస్తే రాసినాయనను ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేయాల్సొస్తుంది.

భావానికి సరిపడా పదం తెలియక దగ్గరగా ఉందనే పేరుతో వేరొక పదం వాడతారు. దీని వల్ల హాస్యాన్ని మించి అపార్థం చోటు చేసుకునే ప్రమాదం ఏర్పడుతుంది. చెప్పాలనుకున్నవి కాక వేరే అర్థాలు ధ్వనిస్తాయి. లిపి లేదా ధ్వని ఒకేలాగా ధ్వనించే పదాలను ఎడాపెడా వాడేయడం వల్ల వచ్చే ప్రమాదమిది.

మనం చెప్పదలచుకున్న విషయానికి ఆ పదం సరిపోతుందో లేదో సరిగా తెలియకుండానే కొన్ని పదాలను ఉపయోగిస్తుంటారు కొందరు. అలాంటివి వాడినప్పుడు మనం చెప్పాలనుకున్న ఉద్దేశం, భావం పాఠకుడిలోకి వెళ్లదు. ఇందువల్ల ఆ వార్త ప్రయోజనం నెరవేరదు... 'అక్కడ శ్మశాన వైరాగ్యం నెలకొని ఉంది' అని రాస్తాడు ఒకాయన ఏం వార్త వినవలసి వస్తుందోనన్న పరిస్థితిని సూచిస్తూ. వాస్తవానికి వైరాగ్యం వ్యక్తుల్లో నెలకొంటుంది. ప్రాంతంలో కాదు. అక్కడ వైరాగ్యం నెలకొని లేదు. శ్మశాన నిశ్శబ్దం అని రాయాలి. తమకు పని ఇవ్వని ప్రభుత్వ తీరుపై వారు సిఎం ఎదుట అక్కసు వెళ్ళగక్కారు అని రాస్తారింకొకాయన. అక్కసు కాదది. ఆక్రోశం, పరిస్థితిని బట్టి ఆగ్రహం. ఇలా పొసగని పదాలు రాయడం వల్ల భావం దెబ్బతినడమే కాక రాసినాయన గురించి తలచుకొని పాఠకులు నవ్వుకుంటారు. ●

పాఠక స్పందన

అవినీతికి అంతమెక్కడ ?

సెప్టెంబర్ 21 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన కవర్ స్టోరీ చాలా బాగుంది. నకిలీ స్టాంపుల కుంభంకోణం దేశం నలుమూలలా ఎలా వ్యాపించిందో చాలా చక్కగా తెలియజేశారు. మాఫియాకు రాజకీయ నాయకులు, అధికారులు బాగా తోడ్పడుతున్నారు. ఇలాంటి కుంభకోణాలను ప్రభుత్వాలు తొక్కిపెడుతున్న తీరు చూస్తుంటే చాలా ఆవేదన కలుగుతోంది. ముఖ్యంగా మన రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వంలోని మంత్రే నకిలీ స్టాంపుల కుంభకోణానికి పాల్పడ్డారంటే ఆశ్చర్యపడాల్సిందే. అవినీతి పరులను ప్రజలు ఎక్కడికక్కడే ఎండగట్టిన నాడే ఇలాంటి కుంభకోణాలకు అవకాశం లేకుండా ఉంటుంది.

\- మురళీకృష్ణ, విజయవాడ

అంతా కాలుష్యమయం

అక్టోబర్ 5వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన ముఖ చిత్ర కథనం విజ్ఞానదాయకంగా ఉంది. దేశంలోనూ, ప్రపంచంలోనూ కాలుష్యం నానాటికీ పెరిగిపోతూ భూగోళంపై ఉష్ణోగ్రత విపరీతంగా పెరిగిపోతోంది. ఈ వాయు కాలుష్యంతో ఓజోన్ పొరకు కూడా తీవ్ర ప్రమాదం దాపురించింది. దానిని కాపాడుకోవాలంటే కాలుష్యాన్ని తగ్గించే చర్యలను చేపట్టాల్సి వుంది. దీనికోసం వృక్షసంపదను పెంపొందించుకోవలసిన అవసరం ఎంతైనా వుంది.

\- నాగ శిరీష, హైదరాబాద్

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా

అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్ధసంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761,
మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది

ప్రగతి పథంలో

మేడిపల్లి గ్రామ పంచాయతి

ఘట్కేసర్ (మం) రంగారెడ్డి జిల్లా

నారా చంద్రబాబునాయుడు
రాష్ట్ర ముఖ్యమంత్రి

టి.దేవేందర్‌గౌడ్
రాష్ట్ర హోంశాఖమంత్రి

కె.జ్ఞానేశ్వర్
జడ్.పి.ఛైర్మన్

ఎం.సుధీర్‌రెడ్డి
యం.పి.పి.ఘట్కేకేసర్

శశిరేఖ
ఫీర్జాదిగూడ, ఎంపిటిసి

చెర్కు వరలక్ష్మి
మేడిపల్లి, సర్పంచ్

ఎ.రాజయ్య
ఉప సర్పంచ్

కె.బాగ్యలక్ష్మి
2వ వార్డు

వి.యాదయ్యగౌడ్
3వ వార్డు

సి.హెచ్. మహేశ్వర్‌గౌడ్
4వ వార్డు

బి.మాదవి
5వ వార్డు



ఎం.బాలనర్సింహ
6వ వార్డు

సిహెచ్.పెంటయ్య గౌడ్
7వ వార్డు

కె.బాలు
8వ వార్డు

బి.నర్సమ్మ
9వ వార్డు

పి.మహేందర్
10వ వార్డు

ఉపేందర్ రెడ్డి గ్రామ కార్యదర్శి

అభివృద్ధి కార్యక్రమాలు : 1. 7 లక్షలతో మెటల్ రోడ్ల నిర్మాణం, 2. వీకర్ సెక్షన్ కాలనీలో 2 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం. 3. 2 లక్షలతో ప్రైమరీ స్కూల్ ప్రహరిగోడ నిర్మాణం. 4. 22 లక్షలతో గెస్ట్‌హౌస్ నిర్మాణం 5. (మండల నిధులు) 2 లక్షలతో డ్వాక్రా భవన నిర్మాణం 6. 2 లక్షల 50 వేలతో బోరుబావి, పైపులైన్ల నిర్మాణం 7. 30 వరకు కరువు మరియు వృద్ధాప్య పించన్లు 8. 10 లక్షలతో సిసి రోడ్స్ అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణం. 9. 71 మందికి పట్టాల పంపిణి. 10. 2 ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు.

భవిష్యత్ కార్యక్రమాలు : 1. గ్రామమంతా మురికి కాలువల నిర్మాణం, 2. బిటి., సిసి రోడ్ల నిర్మాణం, 3. నీటిసమస్యను అదిగమించటం, 4. పి& టి కాలనీలో సబ్ స్టేషన్ సాధనకు కృషి